
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఆదిలాబాద్
20
మంగళవారం 1 ఆగస్టు 2017



## కుంటాల అందాలు.. ఓ తీపి జ్ఞాపకం



కుంటాల జలపాతం వద్ద ట్రైనీ ఐఏఎస్‌లు

- ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా ఏర్పడ్డ జలపాతం
- మరింత అభివృద్ధి జరిగితే పర్యాటకుల తాకిడి పెరుగుతుంది
- ఐఏఎస్ శిక్షణలో భాగంగా ఇక్కడికి వచ్చాం
- కుంటాల జలపాతాన్ని తనివితీరా వీక్షించిన ట్రైనీ ఐఏఎస్‌లు

8

ఫోకస్

# ఫుల్లు కిక్కు



9

- బెల్ట్ బాగోతంపై పెదవి విప్పని అధికారులు
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అక్రమ అమ్మకాలు
- చక్రం తిప్పుతున్న బడా మద్యం వ్యాపారులు
- పేదల ఒళ్లు గుల్లవుతున్నా పట్టింపు కరువు
- మామూళ్లు ఇస్తే సరి.. లేకపోతే దాడులే
- జిల్లాలో చర్చనీయాంశంగా ఎక్సైజ్ శాఖ పనితీరు!!

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

**గ్రామాల్లో తాగేందుకు** మంచినీళ్లు కరువైనా.. మద్యం దొరకని పల్లెలు అంటూ ఎక్కడా లేవు. జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపుల బాగోతం యథేచ్ఛగా సాగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం విక్రయాలు కొనసాగుతుండడంతో మందుబాబులు రోజంతా ఫుల్లు కిక్కుతో జోగుతున్నారు. జేబులకు చిల్లులు పడేలా పూటుగా తాగుతూ ఎంతో మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ కళ్లు తెరవడం లేదంటూ సామాన్య జనంలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మామూళ్ల మత్తులో అధికారులు 'బెల్ట్' తీయడం లేదంటూ ఆరోపణలు లేకపోలేదు. గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపిన ఆ శాఖ.. పల్లెల్లో మద్యం అక్రమ అమ్మకాలపై స్పందించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.





## తల్లిపాలతో.. నిండు నూరేళ్ల జీవితం!

- అమ్మ పాలే శిశువుకు ఆరోగ్యం
- బిడ్డకు పాలివ్వక అనారోగ్యం పాలవుతున్న తల్లులు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

సీఏస్‌లో..

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలను ఆలకించిన కలెక్టర్ బుద్ధ ప్రకాష్
- ఆయా గ్రామాల నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు

5



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బుద్ధ ప్రకాష్

## అంగన్‌వాడీలు విధులను సక్రమంగా నిర్వర్తించాలి

- కాంట్రాక్టర్లు మురిగిన గుడ్లు ఇస్తున్నారు
- మహిళా శిశు సంక్షేమ శాఖ చైర్మన్ కస్తాల ప్రేమల

3

## రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ భూస్థాపితమే..

8


- ఆదిలాబాద్ నుంచే విజయ ప్రస్థానం ఆరంభం కావాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి



## కాటేసే కాలం!

8

వర్షాకాలంలో పచ్చదనంతో కళకళలాడే ప్రాంతాల్లో పాముల బెడద సర్వసాధారణం. నీటి నిల్వ గుంతలు, చెట్ల పొదలు, పరిస రాల్లోని ఖాళీ ప్రదేశాలు, ముఖ్యంగా పంటచేలలో పాములు సంచరిస్తుంటాయి. కాగా, ఇటీవల జిల్లాలో పాము కాటుకు గురై పలువురు మృతి చెందారు. పాము కాటుకు గురైన వారు ఏం చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్య నిపుణులు సూచిస్తున్నారిలా..



ఇంటర్వ్యూ
I.N.T.E.R.V.I.E.W

# ఉపాధిహామీ కింద వైకుంఠదామాలు

**- రాథోడ్ రాజేశ్వర్, గ్రామీణాభివృద్ధి అధికారి, ఆదిలాబాద్ జిల్లా**



**ఉట్నూర్ :** ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైకుంఠ దామాలు(శ్మశానాలు) నిర్మిస్తామని, ఇప్పటికే ఉన్నవాటిని అభివృద్ధి చేస్తామని ఆదిలాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్ రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్ర :** శ్మశాన వాటికల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయా?

**జ :** ప్రభుత్వం వైకుంఠదామాల పేరిట శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని 30 గ్రామాల్లో వైకుంఠదామాల కోసం నిధులు మంజూరు చేసింది. ఒక్కోదానిని రూ. 10.50 లక్షల ఉపాధి నిధులతో నిర్మించబోతున్నాం. ఉట్నూర్ మండలంలో ఉట్నూర్, లక్కారం, నాగాపూర్‌లో వైకుంఠదామాల కోసం స్థలాలు గుర్తించాం.

**ప్ర :** జిల్లాలో ఎంత మంది ఉపాధి కూలీలు ఉన్నారు ? బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం పూర్తయిందా?

**జ :** జిల్లాలో 3.25 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. కూలీలందరి ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియ జరుగుతున్నది. ఇది పూర్తయితే సొమ్మును నేరుగా కూలీల ఖాతాల్లో జమచేస్తాం.

**ప్ర :** ఉపాధి కూలి చెల్లింపుల్లో ఇబ్బందులు తొలగిపోయాయా?

**జ :** పెద్దనోట్లు రద్దు సమయంలో కొంత ఇబ్బంది జరిగింది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందీ లేదు. రూ.4.91 కోట్ల నిధులు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నాయి. గత గురువారం ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా రూ.45 లక్షలు పంపిణీ చేశాం.

**ప్ర :** పాఠశాలల్లో వంటగదులు, మరుగుదొడ్ల నిర్మాణం ఎక్కడిదాకా వచ్చింది?

**జ :** ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల్లో 297 వంటగదులు, వంద మరుగుదొడ్లు నిర్మించనున్నాం. ఒక్కో మరుగుదొడ్డికి రూ.2.10 లక్షలు, ఒక్కో వంట గదికి (మొదటి రకం) రూ.2 లక్షలు, రెండోరకపు వంట గదులను రూ.2.5 లక్షలతో నిర్మిస్తున్నాం. ఒకోక్కదానికి మొదటి రకానికి రెండు లక్షలు, రెండవ రకానికి 2.50 లక్షలతో చేపట్టడం జరుగుతుంది.

**ప్ర :** జిల్లా వ్యాప్తంగా ఎన్ని పశువుల పాకలు నిర్మించనున్నారు ?

**జ :** జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 20 చొప్పున పశువుల పాకలు మంజూరు చేస్తున్నాం. ఒక్కో పాకకు రూ.51 వేలు చెల్లిస్తున్నాం.

# 'అక్షరాలా' అరవై రోజులు!

- నేటి నుంచి పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి కార్యక్రమం
- ఒకటి మొదలు తొమ్మిదోతరగతి విద్యార్థులకు బేసిక్స్‌పై అవగాహన
- అక్షరాల నుంచి లెక్కల వరకు ప్రత్యేక బోధన
- ఎస్సీఈఆర్టీ కార్యాచరణ ప్రణాళిక
- రెండు నెలల్లో పేపర్ చదివే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం



ప్రధానోపాధ్యాయులకు శిక్షణ(ఫైల్)

**మంచిర్యాల టౌన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక అంశాలపై కనీస అవగాహన కల్పించే లక్ష్యంతో 'స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యూకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ)' రూపొందించిన ప్రణాళిక నేటి నుంచి అమల్లోకి రానున్నది. ఇందులో భాగంగా ఆగస్టు 1వ తేదీ నుంచి ఒకటి మొదలు తొమ్మిదో తరగతి విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం పేరుతో పూర్వపుస్థాయిలో శిక్షణ ఇవ్వనుంది. తెలుగు, ఆంగ్లం, గణితంపై ప్రాథమిక స్థాయిలో అన్ని అంశాలను నేర్పించనున్నారు. అ, ఆలు మొదలు కొని చిన్న చిన్న ఆంగ్ల పదాలు, కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం నేర్పించడంతోపాటు 60 రోజుల్లో దిన పత్రికలు చదవగలిగే స్థాయికి విద్యార్థులను తీసుకెళ్లాలనే లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు. ఇందుకు సంబంధించి గత నెల 4 నుంచి 7వ తేదీ వరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వగా 19న జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్‌లకు ట్రైనింగ్ తరగతులు నిర్వహించారు. 25 నుంచి 28వ తేదీ వరకు స్కూల్ కాంప్లెక్స్‌లలోని ఉపాధ్యాయులందరికీ అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం కోసం విద్యాశాఖ ప్రత్యేకంగా రోజువారీ తరగతుల చార్ట్‌ను తయారుచేసి, ఉపాధ్యాయులకు అందజేసింది. గణితంలో రాత లెక్కలతోపాటు భిన్నాలు, కొలతలు, రేఖాగణితానికి చెందిన కనీస సామర్థ్యాల గురించి బోధించాల్సి ఉంటుంది. తెలుగులో చిన్న వ్యాసాల ఆధారంగా సంభాషణలు, కథలను రాయగలగడం, ధారాళంగా చదవడం నేర్పించాల్సి ఉంటుంది.

**● పాఠ్యపుస్తకాలకు అదనంగా...**

వివిధ తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల బోధనతోపాటు అదనంగా ఈ ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. నేటి విద్యార్థులకు 9వ తరగతి పూర్తి చేసినా కనీసం తెలుగులో రాయడం, చదవడం రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఆంగ్లంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పెద్ద, చిన్న అక్షరాలకు కూడా తేడా తెలియని విద్యార్థులు ప్రస్తుతం తారసపడుతున్నారు. అలాగే చిన్న చిన్న లెక్కలు కూడా రాక కిరాణ దుకాణాలు, కూరగాయల మార్కెట్లో కొనుగోళ్లు చేయలేపోతున్నారు. దీనిని అధిగమించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అభ్యసనాభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి రోజూ ఉదయం నాలుగు పీరియడ్లు పాఠ్యాంశాలు బోధిస్తుండగా మధ్యాహ్నం నాలుగు పీరియడ్లు అభ్యసనాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నారు. 60 రోజుల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తారు. ఈ కార్యక్రమంలో పదోతరగతి విద్యార్థులను మినహాయించారు.

**● పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు...**

ప్రత్యేక శిక్షణ తరగతులను పర్యవేక్షించేందుకు జిల్లాలవారీగా జిల్లా విద్యాశాఖ అధికారి నేతృత్వంలో రిసోర్స్ పర్సన్‌లు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులను బృందాలుగా నియమించారు. వారి దైనందిన కార్యక్రమాలతోపాటు అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవసరమైన సూచనలు, సలహాలను ఈ బృందాలు అందజేస్తుంటాయి. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వారి నైపుణ్యం పరిక్షేందుకు మధ్య మధ్యలో పరీక్షలు నిర్వహిస్తారు. చివరగా 60 రోజుల శిక్షణ పూర్తికాగానే తుదిపరీక్ష నిర్వహించి విద్యార్థుల అభివృద్ధిని సంబంధిత రిసోర్స్ పర్సన్‌లు ఎస్సీఈఆర్టీకి పంపించాల్సి ఉంటుంది. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం నిర్వహించేందుకు పాఠశాలలకు అవసరమైన సామాగ్రిని విద్యాశాఖ పంపిణీ చేసింది. స్నేహబాల కార్డులు, వర్ణమాల, గుణింతాలు, పదజాల పట్టికలు, ఎక్కాల పుస్తకాలు, సంఖ్యాకార్డులను అందజేశారు.

**● సిలబస్‌కు ఆటంకం...**

అభ్యసనాభివృద్ధి కార్యక్రమం వల్ల పెద్ద తరగతుల సిలబస్‌కు ఆటంకం కలిగే అవకాశాలున్నట్లు పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. కేవలం ఉదయం నాలుగు పీరియడ్లు బోధిస్తే నిర్ణీత సిలబస్ పూర్తికాదనేది వారి అభిప్రాయం. విద్యార్థులకు ప్రాథమిక స్థాయినుంచి అవగాహన కల్పించడం అవసరమే అయినప్పటికీ సిలబస్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నారు.

## తప్పనిసరిగా నిర్వహించాలి

**- డి. రాజేశంగౌడ్, స్టేట్ రిసోర్స్ పర్సన్, జిల్లా నోడల్ అధికారి**



శిక్షణ పొందిన విధంగా ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలి. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం విద్యార్థుల స్థాయిని ఎప్పటికప్పుడు పరీక్షించి రిపోర్టును విధిగా అందజేయాలి. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉంది. వారానికి ఒకసారి ప్రధానోపాధ్యాయుడు పిల్లల ప్రగతిని తెలుసుకోవాలి. ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించాలి.

ఆధ్యాత్మికం

# స్వామిని స్మరిస్తూ ఆలయంలో ప్రదక్షిణ చేయాలి

**- గంగారపు వంశీకృష్ణ శర్మ, నస్పూర్ కాలనీ**



**నస్పూర్ :** ఆలయంలో దైవ దర్శనానికి వెళ్లాలనుకున్నప్పుడు స్వామి వారిని స్మరిస్తూ ముందుగా ప్రదక్షిణలు చేపట్టాలి. ఈ సమయంలో తొందర పడవద్దు. ఏ ఆలయానికి వెళ్ళినా దర్శనానికి ముందుగా 11, 21, 108 ప్రదక్షిణలు భక్తులు చేస్తారు. ప్రదక్షిణలో "ప్ర" అనే అక్షరం పాపాలను నాశనం, "ద" అనగా కోరికలు తీర్చుమని, "క్షి" అన్న అక్షరం మరు జన్మలో మంచి జన్మ ఇవ్వమని "ణ" అనగా అజ్ఞానం పారద్రోలి ఆత్మజ్ఞానం ఇవ్వమని గుడిలో భగవంతుడి చుట్టూ తిరిగే చుట్టూ "ప్రదక్షిణం" కు అర్థం. అదే నవ గ్రహాల చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేస్తారు. మనస్సును ప్రశాంత పరిచి స్వామిని మనస్సులో ధ్యానిస్తూ మంత్రం, అష్టోత్తరం, ఇవీ రాని వారు స్వామి నామ జపం చేస్తూ ప్రదక్షిణలు చేయాలి. స్వామి వారి నామ జపం చేస్తూ భక్తితో దైవం చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో మౌనంగా స్వామిని స్మరించాలి. ఆలయంలోని గర్భగుడిలో దేవత విగ్రహం ఉంటుంది. ప్రతి నిత్యం పురోహితులు జరిపే అర్చనలలోని మంత్రాల ద్వారా ఆ మంత్రాలలో ఉండే శక్తిని విగ్రహం కిందనున్న యంత్రం ఆ శక్తిని గ్రహించి ఆ శక్తి ద్వారా మన కోర్కెలను తీరుస్తుంది. దైవదర్శనానికి వెళ్ళినప్పుడు మన మది నిండా భగవంతుడి రూపమే నింపి నిధానంగా ప్రదక్షిణలు చేసి స్వామి కృపకు పాత్రులు కావాలి. ఎక్కువ ప్రదక్షిణలు చేసినట్లతే స్వామి వారు కరిణించి కోర్కెలను తీర్చుతాడని భక్తుల విశ్వాసం.

Employee Voice

ఉద్యోగి వాయిస్

# ఉద్యోగోన్నతులు కల్పించాలి

**- ఎం.శ్రీనివాస్, టీటీయూ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి**



**మందమర్రి :** ఉమ్మడి సర్వీస్ రూల్స్‌లో భాగంగా వెంటేనే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తిచేసి, ఉద్యోగోన్నతులు కల్పించాలి. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో భార్యాభర్తలు వేర్వేరు జిల్లాల్లో పనిచేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లా బదిలీలు, సాధారణ బదిలీలు చేపట్టిన తర్వాతే ఉద్యోగోన్నతులు కల్పిస్తే ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుంది. బదిలీలు చేపట్టకుండా ఉద్యోగోన్నతులు కల్పిస్తే పట్టణాల్లో పనిచేసేవారు పట్టణాల్లోనే, గ్రామాల్లో పనిచేసేవారు గ్రామాల్లోనే ఉంటారు. దీని వల్ల ఎన్నో సంవత్సరాలుగా మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి నష్టం జరుగుతుంది. ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్న ఉపాధ్యాయుల్లో నిరాశానిస్పృహలు అలుముకుంటాయి. ఇదే విషయాన్ని మా ఉపాధ్యాయ సంఘానికి, జిల్లా విద్యాధికారికి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి విన్నవిస్తున్నాం.

# అంగన్‌వాడీలు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

● కాంట్రాక్టర్లు పాడైన గుడ్లు ఇస్తున్నారు ● మహిళ శిశు సంక్షేమ శాఖ చైర్మన్ కస్తాల ప్రేమల

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లాలో గతంలో అంగన్‌వాడీ వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండేదని ఇకనైనా తెలంగాణ రాష్ట్రంలో అటువంటి పరిణామాలకు తావులేకుండా అంగన్‌వాడీ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల మహిళ శిశు సంక్షేమ శాఖ చైర్మన్ కస్తాల ప్రేమల అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులతో సోమవారం గాంధీ పార్కులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇళ్లల్లో కొందరు అంగన్‌వాడీలను నిర్వహిస్తున్నారని వారి వద్ద గర్భిణులు, చిన్న పిల్లలు, కిషోర బాలికలు ఎవరూ ఉండడం లేదని తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సక్రమంగా విధులు నిర్వహించి ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా చిన్న పిల్లలకు, గర్భిణులకు, కిషోర బాలికలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని, గుడ్లను, పాలను అందించాలని ఆదేశించారు. వీటిని పక్కతోవ పట్టించినట్లయితే సహించేది లేదన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీలకు గుడ్ల కాంట్రాక్టర్లు పాడైన వాటిని సరఫరా చేస్తున్నారని దీనిపై దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీలు నిర్లక్ష్యం వహించి కాంట్రాక్టర్లకు సహకరించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు రాకుడదని హితవు పలికారు. ఈ సమా వేశంలో ఇన్‌చార్జి సీడీపీవో హసీనా, సూపర్ వైజర్లు సునిత, దీపవాహిని, అంగన్‌వాడీ ఉద్యోగులు రాధా, లక్ష్మి, ఆదిలాబాద్ అర్బన్, రూరల్ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కస్తాల ప్రేమల

## బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ ముగ్గురి అరెస్టు

**కడెం :** నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన రత్నాల వెంకటేశ్ , బండారి రాజన్న, ఎండి. వాజిద్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపూర్ సీఐ పెద్దన్న కుమార్ తెలిపారు. కడెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. మాసాయిపేట్ గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 12వ తేదీన రాత్రి అదే గ్రామానికి చెందిన రత్నాల వెంకటేశ్, బండారి రాజన్న, యండి వాజిద్‌లు అపహరించి అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలించగా నిర్మల్ బస్టాండ్‌లో సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ బాలకృష్ణ , సిబ్బంది పాల్గొన్నారు.




నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ



# జేసీ చర్యలపై వీఆర్వోల నిరసన



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్వోలు

**ఉట్నూర్ :** మహబూబ్‌నగర్ జాయింట్ కలెక్టర్ శివకుమార్‌నాయుడు చర్యలపై వీఆర్వోలు ఆందోళన నిర్వహించారు. సోమవారం ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం నాయకులు ప్రకాష్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ శివకుమార్‌నాయుడు వీఆర్వో మహ్మద్‌పాషాపై భౌతికంగా దాడులు చేయడం సమజసం కాదన్నారు. ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బంది పట్ల మర్యాదగా ఉండాల్సి ఉండగా జిల్లా స్థాయి అధికారి వీఆర్వోను కొట్టడం సరైంది కాదన్నారు. వీఆర్వోపై దాడి చేసిన జేసీపై చర్యలు తీసుకోవాలని లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు జ్యోతి, సేవంత, బాగుబాయి, లక్ష్మి, కమల, రమత, జంగేశ్వరి, గంగాసాగర్, శివమూర్తి, అజీమ్‌అమ్మద్, గణపతి, చంద్రశేఖర్, సోంజీ, వినాయక్, మాంతయ్యలు పాల్గొన్నారు.

**తలమడుగు:** మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోపై అకారణంగా చేయి చేసుకున్న జేసీపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సోమవారం తలమడుగు తహసీల్దార్ అతికోద్దిన్‌కు వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు దాదేరావు మాట్లాడుతూ బంగారు తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా వీఆర్వోలు అంకిత భావంతో రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహిస్తుంటే వారికి మద్ధతు ఇవ్వాల్సింది పోయి ప్రజల ముందే వీఆర్వోపై జేసీ చేయి చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఇందులో మండల వీఆర్వోలు ఎండీ అసద్, గుణవంత్‌రావ్, గోవింద్‌రావ్ పాల్గొన్నారు.

# నిర్మల్‌లో మళ్లీ మొదలైన కోతుల బెడద

**నిర్మల్‌కల్చరల్ :** గత కొద్ది రోజులుగా కోతుల బెడద లేకుండా ప్రశాంతంగా ఉన్న నిర్మల్ ప్రజలకు తిరిగి కోతుల బెడద మొదలైంది. పట్టణంలోని బంగల్‌పేట్, బుధవార్‌పేట్, చింతకుంటవాడ తదితర ప్రాంతాల్లో కోతులు ఆగడాలు సృష్టిస్తూ ప్రజలను భయ బ్రాంతులకు గురి చేస్తున్నాయి. బంగల్‌పేట్‌కు చెందిన ఆడెపు రాజగంగ (65) అనే మహిళపై దాడి చేయడంతో ఆమె చేతికి తీవ్ర గాయలయ్యాయి. ఈ మేరకు ఆ మహిళ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందింది. మున్సిపాలిటీ అధికారులు కోతులను నివారించేందుకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టి అడవులకు పారద్రోలిన తిరిగి అవి నిర్మల్‌లో పట్టణంలోనే సంచరిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, పసి పిల్లలను గాయపరుస్తున్నాయి. అధికారులు ఇకనైనా స్పందించి కోతులను నివారించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## ఆదిలాబాద్‌లో దేశీదారు మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

**ఆదిలాబాద్‌టౌన్:** అక్రమంగా మహారాష్ట్ర నుంచి తీసుకు వచ్చి విక్రయిస్తున్న దేశీదారు మద్యాన్ని సోమవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామానికి చెందిన భౌనే భూమన్న అనే వ్యక్తి దేశీదారు మద్యాన్ని విక్రయిస్తుండగా అధికారులు పట్టుకొని 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్సై రాజేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ బాపురావు, కానిస్టేబుల్ ఈశ్వర్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

**ఇచ్చోడ:** అక్రమంగా తరలిస్తున్న కలపను టైగర్‌జోన్ అటవీ శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గేర్జాం గ్రామంలో సోమవారం వేకువ జామున చోటు చేసుకుంది. టైగర్‌జోన్ మండల అటవీ క్షేత్రాధికారి గులాబ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... వేకువ జామున (ఏపీ01ఎస్7532) నెంబర్ గల తవేరా ప్రైవేట్ వాహనంలో కలుపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న క్రమంలో టైగర్‌జోన్ డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ఇబ్రహీం షరీఫ్, ముంతాజ్(ఎఫ్‌బీఓ) బేస్ క్యాంప్ సిబ్బంది పండిత్ భీంరావ్, గణేష్, సందాన్, రాజు, శంకర్ దాడి చేసి చాక చక్యంగా కలపను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ కలప తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న కలపతో అటవీ శాఖ, టైగర్‌జోన్ అధికారులు

## పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

**సారంగాపూర్ :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి ( బి) గ్రామంలోని పాఠశాలను సోమవారం డీఈవో ప్రణీత తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సక్రమంగా సమాధానం ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు.

## గిరిజన పల్లెలో ఉచిత వైద్య శిబిరం

**బజార్‌హత్నూర్:** మండలంలోని మారుమూల గ్రామాలైన గిరిజాయి, ఉమర్డ, ఇంద్రానగర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో కలుషిత నీరుతో అధికంగా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఈ వైద్య శిబిరంలో 85 మందిని వివిధ వ్యాధులున్నట్లు గుర్తించగా నలుగురికి రక్తం సేకరించి పరీక్షలకు పంపించడం జరిగిందన్నారు. ఇందులో సూపర్‌వైజర్ దేవిదాస్, సుశీల, హెల్త్ అసిస్టెంట్ గాజుల రమేష్, ఏఎన్ఎం సంగీత, సంజీవ్‌కుమార్, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

## బిర్లగొందిలో భూమి సవరణల సర్వే



సవరణలు చేస్తున్న ఆర్ఐ ప్రకాష్, వీఆర్వో

**బోథ్:** మండలంలోని బొర్లగొంది గ్రామంలో సోమవారం భూమి సవరణల సర్వేను నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో భాగంగా గ్రా మంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ప్రజలు తమ భూముల వివరాలను ఈ సదస్సుల్లో తెలుసుకోవాలని, ఏవైనా ఇబ్బందులుంటే మార్పిడి చేసుకోవాలని కోరారు. అన్ని గ్రామాల్లో ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో వీఆర్వో రాజేందర్, వీఆర్ఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రధాన్ కులస్థులకు అన్ని అవకాశాలు కల్పించాలి'



మాట్లాడుతున్న సంఘం నాయకులు

**తాంసి:** స్వాతంత్ర్యం వచ్చి 70సంవత్సరాలు గడుస్తున్న ప్రధాన్ కులస్థులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎలాంటి ఆర్థిక స హాయం అందడం లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం రాం కిషన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధాన్ జాగో రథ యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది కుటుంబాలు పూటగడవని పరిస్థితుల్లో ఉన్నయని గుర్తు చేశారు. ముఖ్యంగా తమ కులంలో 99శాతం మంది నిరుపేదలే ఉన్నారని, వెంటనే ఆదివాసీలకు కల్పిస్తున్న అవకాశాలను తమకు కులస్తులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని జాతీయ స్థాయి ప్రత్యేక సమావేశానికి ప్రధాన్‌లు హాజరు కావాలని కోరారు. ఇందులో సంఘం నాయకులు మేస్రం కృష్ణ, గేడంతుంబాజి, లక్ష్మణ్, రమేష్, వసంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పత్తి పంట పరిశీలించిన ఏవో

**బోథ్:** మండల కేంద్రంలోని లింగారెడ్డి అనే రైతుకు చెందిన పత్తి పంటను సోమవారం ఏవో భాస్కర్ పరిశీలించారు. పంటను గులాబి రంగు పురుగు ఆశిస్తుందని రైతు సమాచారం ఇవ్వడంతో పం టను పరిశీలించారు. పొలంలో పత్తి మొక్కలను పరిశీలించి గుడ్డి పువ్వును తొలగించాలని సూచించారు. చేన్లలో బెండ చెట్లను పెంచవద్దన్నారు. గులాబి రంగు పురుగు ఆశించినట్లయితే తక్షణమే సమాచారం ఇవ్వాలని ఏవో సూచించారు. సంబంధిత గ్రామాల ఏఈవోలకు సమాచారం ఇచ్చినట్లయితే తాము పంటలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

## జోరందుకున్న మొరం అక్రమ తవ్వకాలు

● ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**ఇచ్చోడ:** మండలంలోని జల్దా గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఎక్స్‌కావేటర్‌తో అక్రమంగా మొరం తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్ తెలిపారు. సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ వీఆర్వో రోహిదాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు జల్దా శివ్వారం గల మొరం అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రదేశానికి వెళ్లారు. వెళ్లగానే రెండు టిప్పర్ల లారీలు, 4 ట్రాక్టర్స్ ఆ తవ్వకాలు నిర్వహించే ప్రదేశం నుంచి వెళ్లి పోయాయి. అక్కడ అక్రమ తవ్వకాలు నిర్వహించే ఎక్స్‌కావేటర్‌ను స్వాధీనం చేసుకున్నాట్లు ఆర్ఐ తెలిపారు. ఈ మేరకు ఈ విషయమై తహసీల్దార్‌ను మోహన్‌సింగ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా స్పందించలేదు. ఎక్స్‌కావేటర్ ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించింది కావడంతో రెవెన్యూ యాక్ట్ ప్రకారం స్వాధీనం చేసుకోంటారో లేదో వేచి చూడాల్సిందే.

# కరుణించని వరుణుడు.. ఎండుతున్న పంటలు

● ఆందోళనలో అన్నదాతలు

**నేరడిగొండ:** గత 20 రోజులుగా వర్షాలు లేక పోవడంతో పంటలపై భానుడు ప్రతాపం చూపుతున్నాడు. మండలంలో 22396 హెక్టార్లలో పత్తి, 3700 హెక్టార్లలో సోయా పంటలు, 4515 హెక్టార్లలో ఇతర పంటలు రైతులు సాగు చేసుకోగా ఖరీఫ్ ప్రారంభంలో వరుణుడు మురిపించడంతో ఈ సారి విత్తనాలు ఒకేసారి మొలకెత్తినాయి. అంతేకాకుండా పంటలు ఏపుగా పెరిగాయి. గత కొన్ని రోజుల నుంచి వరుణుడు కరుణించక పోవడంతో సోయా పంట ఎండిపోతోంది. అంతేకాకుండా పత్తి పంట దెబ్బ తింటుంది. సోయా పంట పూత కాత దశలో ఉండడంతో వర్షాలు లేక తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రారంభంలో మురిపించిన వరుణుడు ప్రస్తుతం ఏడిపిస్తున్నాడని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వర్షాలు కురవాలని అన్నదాతలు గ్రామాలల్లోని ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. సోయా పంట పూత కాత దశలో ఉండి ఎండి పోతుండడంతో చేసిన అప్పుల ఊబిలో కూరుక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కువ మొత్తంలో పత్తి, సోయా పం టలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. వర్షాదార పంటలు కావడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇకనైనా వరుణుడు కరుణించాలని రైతన్నలు కోరుతున్నారు.



వాలిపోతున్న సోయా పంటతో అన్నదాత రూప్‌సింగ్ జాదవ్

### రూ. 30 వేల పెట్టుబడి అయింది.

సోయా విత్తనాలు, ఎరువుల కోసం నాలుగు ఎకరాలలో సాగు చేయడానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటికే పంట ఎండిపోయే దశలో ఉంది. వరుణుడు కరుణించాలి లేకుంటే అప్పుల్లో కూరుక పోతాం. ఇప్పటికే ప్రైవేట్ అప్పులు చేసి సోయా పంటతో పాటు పత్తి, కంది పంటలను కూడా సా గు చేశాం. పత్తి పంట కూడా వాలి పోతోంది. దిక్కుతోచడం లేదు.



**- మద్దెల నారాయణ స్వామి**
**(సావర్గాం, రైతు)**

# అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

● కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

**సిరికొండ:** డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిరికొండ తహసీల్దార్ కార్యాలయంను ముట్టడించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కె. బషీర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాలు మారుతాయని అనుకుంటే సీఎం కేసీఆర్ ప్రజల ఆశలను వమ్ము చేశాడని ఆరోపించారు. తెలంగాణ వస్తే సమస్యల సాధన కోసం ఎవరూ రోడ్డెక్కద్దు అందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కాని అవీ నేటికి అమలు చేయలేదని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ జాదవ్ శివలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజన్న, కైలాస్, శివాజి, సునిల్, షబ్బీర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

# మొక్కలతోనే జీవితం ముడిపడి ఉంది

● బోథ్ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్

**తలమడుగు:** సమస్త జీవకోటికి మొక్కలతోనే ముడిపడి ఉందని ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో యువజన సంఘాల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని పలు వీధుల గుండా యువజన సంఘాలు, పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్థానిక వెంకటేశ్వర ఆలయం జిల్లా పరిషత్ హైస్కూల్, పోలీసు స్టేషన్‌లో మూడో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ గత 3 సంవత్సరాల్లోనే హరి తహారం పథకాన్ని ప్రవేశ పెట్టి ప్రతీ సంవత్సరం కోట్లాది మొక్కలను నాటించడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా యువజన సర్వీసుల శాఖ, క్రీడాశాఖ స్టెప్ సీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో యువజన సంఘాలను బలోపేతం చేసేందుకు ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. ఇందులో తహసీల్దార్ అతికోద్దిన్, ఎంపీడీవో సునిత, ఎస్సై సుబ్బారావు, తలమడుగు సర్పంచ్ రమేష్, డీఎఫ్‌వో కొండల్‌రావ్; జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు ఎర్రం నర్సింహులు, మండల అధ్యక్షుడు సిడాం రాము, ఉపాధ్యక్షులు అల్లూరి నాగార్జున్‌రెడ్డి, ఏపీవో మేఘమాల, టీఆర్ఎస్ మహిళ మండల అధ్యక్షురాలు కె.సునితారెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, సుంకిడి సర్పంచ్ గోదావరి వెంకన్న పాల్గొన్నారు.



తలమడుగులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

## బోరు బావిని పూడ్చి వేసిన బీడీఎఫ్ సభ్యులు

**బోథ్:** మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిరుపయోగంగా ఉన్న బోరు బావిని బీడీఎఫ్ (బోథ్ డెవలఫ్‌మెంట్ ఫోరం) సభ్యులు సో మవారం పూడ్చివేశారు. నిరుపయోగంగా ఉన్న బోరు బావి ప్రమాదాకరంగా ఉండడంతో దానిని పూడ్చి వేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా బోరు బావులు తెరిచి ఉంటే గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

## మీరాకుమారిని కలిసిన మండల నాయకులు

**తాంసి:** మాజీ స్పీకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీరాకు మారిని సిరిసిల్లా జిల్లాలో మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిశారు. ఇటీవల ఎస్సీ, ఎస్టీలపై దాడి జరిగిన సంఘటలను పరిశీలించేందుకు వచ్చిన ఆమెకు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇందులో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు గంద్రత్ సుజాత, తాంసి మండల కన్వీనర్ సంతోష్, నాయకులు నారాయణ, ఆశన్న, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలంటే విరివిగా మొక్కలు నాటాలి

**నేరడిగొండ:** వర్షాలు కురవాలంటే విరివిగా మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్ అన్నారు. సోమవారం మండలంలోని కుప్టి కుమారి గ్రామాలలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమానికి హాజరైన వారితో మొక్కలు నాటించారు. అనంతరం కుమారిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఇందులో తహసీల్దార్, కూనల గంగాధర్, ఎంపీడీవో రియాజోద్దిన్ స్థానిక సర్పంచ్ మందుల రమేష్, గట్టు నారాయణ, ఆడే పర్సురాం, మండల ఉపాధ్యక్షుడు ఆత్రం లక్ష్మణ్, మాజీ సర్పంచ్ రాథోడ్ సజన్, గడ్డం భీంరెడ్డి, కుంట కిరణ్ కుమార్‌రెడ్డి ప్రేంసింగ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

## కీర్తన డిగ్రీ కళాశాలకు ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు

**బేల:** మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ ఎస్) మంజూరు చేసినట్లుగా కాకతీయ యూనివర్సిటీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా గోడం ప్రవీణ్ నియమించామన్నారు. ఈ ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు కావడంతో విద్యార్థుల్లో సేవా భావం పెరుగుతుందని ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ బుద్ధ ప్రకాష్

**ఆదిలాబాద్‌టౌన్:** వివిధ ప్రాంతాల నుంచి ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బుద్ధ ప్రకాశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకు ముందు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి ఫోన్ ద్వారా అర్జీదారులు తెలిపిన సమస్యలను విన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

### ఏళ్ల తరబడి తిరుగుతున్నాం..

ఏళ్ల తరబడి కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగిన తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని తలమడుగు మండలం ఖోడద్ గ్రామ అర్జీదారులు వాపోయారు. గత 3 సంవత్సరాల క్రితం మంజూరైన మరుగుదొడ్లను నిర్మించుకున్న ఇంత వరకు అధికారులు డబ్బులు చెల్లించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ బుద్ధ ప్రకాష్



కలెక్టరేట్‌కు వచ్చిన తలమడుగు మండల దళిత బస్తీ లబ్ధిదారులు

### బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు..

దళిత బస్తీ కింద 2015-16 సంవత్సరంలో 3 ఎకరాల భూమి ఇచ్చినప్పటికీ వాటి మీద బ్యాంకు అధికారులు క్రాప్‌లోన్ ఇవ్వడం లేదని తలమడుగు మండల గ్రామానికి చెందిన దళిత బస్తీ లబ్ధిదారులు ఆరోపించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం ముందు నిరసన వ్యక్తం చేశారు. సర్వే నెం.55, 20, 53 /1, 69/3లకు చెందిన లబ్ధిదారులకు భూమిని విక్రయించిన వ్యక్తి మహేందర్‌రెడ్డి బ్యాంకులో తీసుకున్న క్రాప్‌లోన్ డబ్బులు చెల్లించక పోవడంతో లబ్ధిదారులకు రుణాలు మంజూరు కావడం లేదన్నారు.

### మసీదు నిర్మాణాన్ని నిలిపివేయాలి..

మావల మండలం మావల పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో ఇళ్ల స్థలంలో మసీదు నిర్మాణం చేపడుతున్నారని వెంటనే దీన్ని నిలిపి వేయాలని కలెక్టర్‌కు కాలనీ వాసులు విన్నవించారు. ఇదే విషయమై మావల ఈవో, తహసీల్దార్‌కు, జేసీకి వినతి పత్రం అందించామని వారు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో కావడి యాత్ర

**బేల:** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని సర్వజనిక్ హనుమాన్ ఆలయంలో నుంచి భక్తులు బయలుదేరి కంగార్‌పూర్ గ్రామం మీదుగా పెన్‌గంగాకు చేరుకొని జలాశయాన్ని తీసుకు వచ్చారు. అనంతరం సదల్‌పూర్ ఆలయాన్ని చేరుకొని మహాదేవ్ భైరందేవ్ విగ్రహాలకు జలాభిషేకం చేశారు. కావడి యాత్రలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బేల సర్పంచ్ మస్కేతేజరావు, వైస్ ఎంపీపీ సంజయ్ నిపుంగే, విఠల్, మానుస్‌మారే, దేవిదాస్, భక్తులు పాల్గొన్నారు.

## 'చలో సెక్రటేరియెట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి'

**జైనథ్:** రాష్ట్రంతో పాటు జిల్లాలోని ఆయా మండల కేంద్రాలలో ఉన్న పౌర సరఫరాల శాఖ హమాలీల ఆధ్వర్యంలో మంగళవారం చలో సెక్రటేరియెట్ కార్యక్రమాన్ని సివిల్ సప్లయ్ హమాలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గాజంగుల రాజు పిలుపునిచ్చారు. జైనథ్ మండల సివిల్ సప్లయ్,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు చేపడుతున్న నిరాహార దీక్ష 6వ రోజుకు చేరుకుంది. ఈ దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి భద్రత కల్పించాలన్నారు. ఇందులో సివిల్ సప్లయ్ హమాలీల జైనథ్ మండల అధ్యక్షులు ఈర్ల పోచ్చన్న, కార్మికులు అన్నెల అడెల్లు, అన్నెల రాజన్న, అన్నెల రాజలింగు, అన్నెల వెంకటి, కోవగోవింద్, ఈర్ల ఊశన్న, సాకపెల్లి దేవిదాస్‌లు పాల్గొన్నారు.

## 'యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'




యువకులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

**బేల:** యువత మంచి మార్గాన్ని ఎంచుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కోల నరేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొబ్బాయి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో యువకులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామ యువకులకు ఎస్సై తరుపు నుంచి వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ గేడం మనోజ్ పాల్గొన్నారు.

## డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ

**బేల:** మండలంలోని బాది గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.లక్షతో డ్రైనేజీల నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ సునిత నందు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం దశల వారీగా మురికి కాలువలు, సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కె. రాఘవులు, టీఆర్ఎస్ నాయకులు రాసుల్, జాకీర్, ప్రకాష్, ఉత్తంలు తదితరులు పాల్గొన్నారు.

# 'గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించాలి'

**జైనథ్:** మండలంలోని 29 గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా గ్రామాల్లోని రైతులు గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించాలని మండల వ్యవసాయాధికారి ఎ.వివేక్ అన్నారు. సోమవారం మండలంలోని లేఖర్‌వాడ, సావాపూర్, బాలాపూర్, ఆకుర్ల గ్రామాల్లోని పత్తి పంట పొలాలను ఎంపీపీ టి.శోభతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరంకు 8 లింగాకర్షణ బుట్టలను అమర్చాలని సూచించారు. దీంతో పాటు ప్రొపెనోఫాస్ 400 ఎంఎల్‌కు 200 లీ టర్ల నీటితో కలిసి ఎకరానికి కలిపి పిచికారి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్, సావాపూర్ సర్పంచ్‌లు తమ్మడి భగవాన్, జి.సునిల్, యు.దౌలత్, సుమన్, వ్యవసాయ విస్తర్ణాధికారి సుజాత ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

### రైతులు పంటల గురించి జాగ్రత్తలు పాటించాలి..

**బేల:** మండలంలోని రైతులు పత్తి, సోయా, కంది పంటలపై గులాబీ రంగు పురుగు ఉధృక్తను నివారించడానికి జాగ్రత్త వహించాలని మండల వ్యవసాయ అధికారి భగత్‌రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని డోప్టాల గ్రామ శివారులోని పంటలను ఆయన పరిశీలించారు. నివారణకు ఫ్యూరమోన్ ట్రాప్ 10-12(లింగాకర్షక బుట్టలు) ఏర్పాటు చేసుకొని గడ్డిపూలను ఎరి వేయలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వనితగంభీర్ టాక్రె, డోప్టాల మాజీ సర్పంచ్ వైద్య కిషాన్, రైతులు పాల్గొన్నారు.

## ' సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ'

**ఆదిలాబాద్‌టౌన్:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని రాష్ట్రంలోనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం కోసం పీఆర్టీయూ ముందంజలో ఉందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లరత్నాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నెంబర్ 1లో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ అర్బన్ పీఆర్టీయూ శాఖ ఎన్నికల్లో ఆయన పాల్గొన్నారు. జడ్పీ ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తు న్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనలో సంఘం చేసిన కృషి మరువలేనిదని గుర్తు చేశారు. అనంతరం ఎన్నికల అధికారులు రామకృష్ణ, జనార్ధన్, శ్రీనివాస్‌లు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతన కమిటీ అధ్యక్ష కార్య దర్శులుగా కిషన్, లక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఘనంగా సన్మానించి నియామక పత్రాన్ని అందించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు దారట్ల జీ వన్, నాయకులు సూర్యకాంత్, రాణి, సంధ్యా, సవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ లావాదేవీలపై అవగాహన

**ఆదిలాబాద్‌టౌన్:** ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ మండలం అనుకుంట గ్రామంలో రైతులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి సత్యనారాయణ వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ విఘ్నేశ్వర్‌రెడ్డిలు డిజిటల్ లావాదేవీలు వినియోగం దాని లాభాలు రైతులకు వివరించారు. అదే విధంగా బ్యాంక్ లావాదేవీల పై ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉమ మహేశ్వర్ వాలంటీర్లకు అవగాహన కల్పించారు. అనంతరం మనోవికాస నిపుణులు సల్లా విజయ్‌బాబు వాలంటీర్లకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్.యాదవ్, సురేష్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# 'రక్తదానం చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యత'



రక్తదానం చేస్తున్న ఆర్ఎం రాజేంద్ర ప్రసాద్

**ఆదిలాబాద్‌టౌన్:** రక్తదానం చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆర్టీసీ ఆదిలాబాద్ ఉ మ్మడి జిల్లా ఆర్ఎం రాజేంద్ర ప్రసాద్ అన్నారు. జూలై 25 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ఆర్టీసీ ప్రమాదరహిత వారోత్సవాలలో భాగంగా సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉచిత రక్తదాన శిబిర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం రాజేంద్ర ప్రసాద్ ముందుగా రక్తం దానం చేశారు. ఇందులో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సుమారు 50 మంది స్వచ్ఛందంగా ఉచిత రక్తదానం చేశారు. అనంతరం ఆర్ఎం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాల వల్ల ప్రాణ ప్రాయానికి చేరుకొని రక్తం అందక మృతి చెందుతున్నారన్నారు. మనమంతా సామాజిక బాధ్యతగా రక్తం దానం చేయాలన్నారు. ఇందులో అధి కార గుర్తింపు సంఘం నాయకులు కిషన్, హుసేన్, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఈయూ, తెలంగాణ మజ్దూర్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఒరిజినల్స్ సమర్పించాలి

**ఉట్నూర్:** కుమ్రం భీం ప్రాంగణంలోని గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థలో ప్రవేశం పొందిన అభ్యర్థులు మంగళవారం సాయంత్రం 5 గంటలలోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాలని ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు కోరారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీఐకి దరఖాస్తులు చేసుకున్న కొందరు విద్యార్తులకు సీట్లు వచ్చినా సర్టిఫికెట్లు సమర్పించలేదని, గడువు లోగా సర్టిఫికెట్లు ఇవ్వకపోతే సీట్లు కోల్పోతారని ప్రిన్సిపాల్ తెలిపారు.

# గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోశం
- నీళ్లు లేక స్నానాలు చేయట్లే.. వాపోయిన విద్యార్థులు
- రాళ్లు, పురుగుల దొడ్డు బియ్యం: విద్యార్థి సంఘాల ఫిర్యాదు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ పోశం

**ఉట్నూర్:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోశం హామీ ఇచ్చారు. సోమవారం సమస్యల పరిష్కారం కోసం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు ఆందోళన చేస్తున్నట్లు తెలిసి ఆయన స్వయంగా అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు శంకర్, విజయ్ తదితరులు మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఫలితంగా విద్యార్థులు ప్రతీ రోజు స్నానం చేయలేక పోతున్నారని తెలిపారు. దీంతో వ్యక్తిగత పరిశుభ్రత సమస్యగా మారి చర్మవ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారని, ప్రార్థన సమయంలో నిలబడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఉపాధ్యాయులచే చివాట్లు తినాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై డీడీ పోశం మాట్లాడుతూ విద్యార్థులకు ఎంటువంటి సమస్య ఉన్నా వెంటనే తనకు తెలియజేయాలని, పాఠశాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. త్వరలోనే ప్రతీ విద్యార్థితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని అన్నారు. పాఠశాలకు కావాల్సిన లైట్లు, నల్లాల ఏర్పాటు చేసి నీటి ఇబ్బందిలేకుండా చేస్తానన్నారు. కాగా, ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు బోజ్జు, కోట్నాక్ గణపతి, ఆత్రం తిరుపతి, కుడిమెత మధు తదితరులు డీడీ పోశంలో మాట్లాడారు. విద్యార్థులకు అందజేయాల్సిన సరుకులను సక్రమంగా ఇవ్వడం లేదని, దొడ్డు బియ్యం సరఫరా చేయడంతో పిల్లలు అన్నం తినలేక పోతున్నారని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో రాళ్లు, పురుగులు ఉంటున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై డీడీ పోశం మాట్లాడుతూ సరుకులు సరఫరా చేసే గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఏటీడీవో సత్యవతి, ప్రధానోపాధ్యాయుడు ఉత్తం, వార్డెన్ ప్రేంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- విద్యార్థులకు సీఐ గణపతి ఉద్బోధ


మాట్లాడుతున్న సీఐ గణపతి జాదవ్

**ఉట్నూర్:** చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఉట్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గణపతి జాదవ్ విద్యార్థులకు హితవు పలికారు. సోమవారం ఆయన శ్యాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హరితహారం కింద మొక్కలు నాటిన అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 18 ఏళ్ల లోపు వారిని ఎవరైన పనుల్లో పెట్టుకుంటే వారు శిక్ష అర్హులవుతారని అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-3 ద్వారా బడికి దూరంగా ఉండే బడీడు పిల్లలను పాఠశాల్లో చేర్పుతామన్నారు. బాలికల చదువు, భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసిందని అన్నారు. మాజీ సర్పంచ్ జగదీష్, వెంకట్‌రావు, గరీబ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జగన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'బిల్లు' కోసం ఒంటికాలిపై నిరసన


ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఉట్నూర్ రూరల్:** ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేస్తున్న రిలే దీక్షలు ఏడో రోజుకు చేరాయి. సోమవారం దీక్ష సందర్భంగా ఆందోళనకారులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 23 ఏళ్లుగా చేస్తున్న ఉద్యమం చివరి దశకు చేరిందన్నారు. ఈ రిలే దీక్షలు ఆగస్టు 7 వరకూ నిర్వహిస్తామని, ఈ లోగా బిల్లు పెట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము రవి, రాందాస్, వికాస్, చంద్రపాల్, ప్రసాద్, సురేష్, బక్కన్న, వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

**నార్నూర్:** ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ ఉత్తం అన్నారు. సోమవారం ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఈఆర్పీ జాదవ్ విజయ్ సింగ్ లతో కలసి మన్నాపూర్ ఆశ్రమ పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు రాథోడ్ వినంత్‌రావ్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆర్జేడీ రాథోడ్ రామారావ్, సర్పంచ్ నాగోరావు, ఉపాధ్యాయులు, డీటీఎఫ్ నాయకులు రాథోడ్ బాబులాల్, నిర్మల, సుభద్ర, హెచ్‌డబ్ల్యూవో దశరథ్, నీలయన, జాదవ్ విశ్వనాథ్, తుకారాం, ప్రకాష్, మాజీ ఎంపీటీసీ జాదవ్ కమల తదితరులు పాల్గొన్నారు.

## పూత దశలో సోయాకు కాండం తొలుచు పురుగు

- పత్తికి గులాబీ పురుగు బెడద లేదు
- వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్


సోయాలో కాండం తొలుచు పురుగు

**ఇంద్రవెల్లి:** మండలంలో పత్తి పంటకు గులాబీ రంగు పురుగు తాకిడి లేదని మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కేస్లాపూర్, కినగూడ తదితర గ్రామాలలో పత్తి, సోయబీన్ పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు అత్యధికంగా నష్టం చేసే గులాబీ రంగు పురుగు తాకిడి మండలంలో లేదని, ఈ విషయంలో రైతులు ఆందోళణ చెందవద్దన్నారు. ఈ పురుగు ఆశించకుండా పత్తి పైరుకు 65 రోజుల వరకు లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా ఎకరానికి 5 నుంచి 7 వరకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, సోయా పూతదశలో ఉందని ఈ సమయంలో కాండం తొలుచు పురుగు ఆశించిందని ఆయన తెలిపారు. కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రోఫినోఫాస్ 50 ఈసీ 3 మిల్లీమీటర్లు, నువాన్ 2.5 మిల్లీలీటర్లను నీమ్ ఆయిల్‌తో కలిపి సోయా పైరుపై పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

## ఉపాధి బకాయిలు ఇప్పించండి.. సారూ!

- దర్బార్‌లో గిరిజనుల వేడుకోలు


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో విద్యాసాగర్

**ఉట్నూర్ రూరల్:** ఉపాధి హామీ చేసిన పనులకు కూలి బకాయిలు ఇప్పించాలని గాదిగూడ మండలం డోంగ్రగాం, చిత్తగూడ గ్రామాలకు చెందిన గిరిజనులు కోరారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో రెండు గ్రామాల గిరిజనులు రాజుబాయి ఆధ్వర్యంలో ఈ మేరకు ఆర్డీవో విద్యాసాగర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కాగా టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పించాలని రాథోడ్ విష్ణు (సాకెర, ఉట్నూర్), సాకెరను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని పెందూర్ యశ్వంత్‌రావు తదితరులు, గ్రామ పంచాయతీని విభజించవద్దని ఎంపీటీసీ చౌహాన్ శేషారావు (ఎందా, ఉట్నూర్), రాంలింగంపేట, శివగూడ, సాకేర(బి), సాకేర(కే), సాకేర(ఎం)లను కలిపి పంచాయతీ చేయాలని రాంలింగంపేటకు చెందిన పెందూర్ యశ్వంత్‌రావు, పై చదువుల కోసం ఆర్థిక సహాయం అందించాలని లక్ష్మి (బోయవాడ, ఉట్నూర్), మేకలు, స్పింకర్లు మంజూరు చేయాలంటూ గంగారాం, జైవంత్‌రావు, కుడిమెత బండులు (బాబేఝరి, నార్నూర్), వివిధ సమస్యలపై మరికొందరు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ లక్కేరావు, డీడీ పోశం, ఎంపీడీవో లక్ష్మణ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు,

## వ్యవసాయ విప్లవ నేతలకు ఘన నివాళులు



మాట్లాడుతున్న నేతావత్‌రాందాస్.. హాజరైన ప్రజలు

**ఉట్నూర్ రూరల్:** వ్యవసాయక విప్లవ ఉద్యమాన్ని ప్రారంభించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించిన అమరులు దొడ్డి కొమురయ్య, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, తరిమెల నాగిరెడ్డిలకు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. పాత ఉట్నూర్‌లోని తరిమెల నాగిరెడ్డి కాలనీలో ఆదివారం రాత్రి నిర్వహించిన అమరుల సంస్మరణ సభలో నేతవత్ రాందాస్ మాట్లాడారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, తరిమెల నాగిరెడ్డి, దేవుపల్లి వెంకటేశ్వర్‌రావు, కుమ్రం భీం, రాంజీగోండ్, కుమ్రం సూరు, బిర్స ముండలకు విప్లవ జోహారులు అందిస్తున్నామన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు మాట్లాడుతూ దోపిడీ పీడనకు సమాజం బలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా ధనికులు, మరింత ధనికులుగా తయారు అవుతుండగా పేదలు మరింత పేదలుగా తయారు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు గడిచినా పేదల బతుకుల్లో మార్పురాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత వర్గాల తరఫను వామపక్ష భావజాలం గల వర్గాల వారందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యఆదివాసీ మహిళ సంఘాల కన్వీనర్ ఆత్రం సుగుణ మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితంగానే పేదలు ఈ మాత్రమైనా బతకగలుగుతున్నారని అన్నారు. విప్లవ పోరాటాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, రాజేందర్, కిషన్, తాతేరావు, జైపాల్‌సింగ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు హానికరం

- జడ్పీటీసీ రూపవంతి పుష్కర్



మాట్లాడుతున్న జడ్పీటీసీ రూపవంత్

**నార్నూర్:** మత్తు పదార్థాలు హానికరమని, వాటికి దూరంగా ఉండాలని జడ్పీటీసీ రూపవంతి పుష్కర్ విద్యార్థులు, యువతకు పిలుపు నిచ్చారు. సోమవారం ఆమె స్థానిక వేదనిధి కళాశాలలో మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. డ్రగ్స్ మాఫీయా దావానలంలా వ్యాపిస్తోందని, దాని ప్రభావం విద్యార్థులపై పడకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. ఎక్సైజ్ శాఖ ఎస్సై వెంకటేశ్వర్ వైద్య, ఎస్ఐ శ్రీకాంత్‌లు, కరస్పాండెంట్ ఉమా కాంత్, ప్రిన్సిపాల్ శివాజి, అధ్యాపకులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# దినఫలాలు

**అదృష్టసంఖ్యలు: 1, 9**




**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొం టారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.



**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** ప్రియత ముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్ని స్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.



**మిథునరాశి:(మే21-జూన్21):** వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితుల ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



**కర్కాటకరాశి:(జూన్22-జూలై23):** పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడ తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణా మాలు సంభవం.



**సింహరాశి:(జూలై24-ఆగస్టు23):** బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధు మిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.



**కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23):** సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.




**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమ కూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజ కీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుం టారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాల తీసుకుంటారు.



**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుం టారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్స వాలకు నిధులు సమకూరుతాయి. ముఖ్య సమాచారం అందు కుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** ఉన్నత పదవులు అందుకుంటారు. భాగ స్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు మెరు గుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రము ఖులను కలుసుకుంటారు.



**మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20):** వృత్తిపర మైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడు గులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# కలెక్టర్ కార్యాలయంలో వినతుల వెల్లువ

● ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి ● కలెక్టర్ ఆర్వీ కర్ణన్

**మంచిర్యాల క్రైం :** మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి వినతులు వెల్లువెత్తాయి. సుమారు 200లకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన ప్రజలు సదరం సర్టిఫికెట్ అందించాలని, ఓసీ నిర్వాసితులకు న్యాయం చేకూర్చాలని, భూ వివాద సమస్యలు పరిష్కరించాలని, వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు చెల్లించాలని ఫిర్యాదులు సమర్పించారు.





కలెక్టర్‌కు వినతులను సమర్పిస్తున్న ప్రజలు, ఓపన్‌కాస్ట్ గుత్తెదారుపల్లి భూ నిర్వాసితులు

**● దరఖాస్తులకు గడువు పొడిగించాలి..**

**- ఐక్య విద్యార్థి సంఘం నాయకులు**

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు తేదీని పొడిగించాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి అరిగెల తిరుమల్‌రావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో టీవీఎస్ జిల్లా అద్యక్షుడు శ్రీనివాస్, వేముల కిరణ్, జుమ్మిడి గోపాల్, రాంటెంకి సుధాకర్, తదితరులు ఉన్నారు.

**● వైద్యులను నియమించాలి..**

**- కొలిపాక శ్రీనివాస్, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి**

బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య నిపుణులను నియమించాలని మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి కొలిపాక శ్రీనివాస్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 8 మండలాలకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సేవలందిస్తుందని, ఆసుపత్రిలో వైద్య నిపుణులు లేకపోవడం వల్ల రోగాల బారిన పడిన రోగులకు వైద్యం అందడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని కోరారు.

**● మరుగుదొడ్ల బిల్లులు అందించాలి..**

**- గొల్లపల్లి గ్రామస్థులు**

హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలోని గొల్లపల్లికి చెందిన వారు తమ వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు అందించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మరుగుదొడ్లు నిర్మించుకొని సంవత్సరం పూర్తయినప్పటికీ వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు అధికారులు అందించడం లేదని వాపోయారు. వినతి పత్రం అందజేసిన వారిలో రామాగౌడ్, గెల్లు పోచన్న, తదితరులు ఉన్నారు.

**● ఓసీ నిర్వాసితులను ఆదుకోవాలి..**

**- గుత్తేదారుపల్లి గ్రామస్థులు**

నస్పూర్ మండలం గుత్తెదారుపల్లి గ్రామంలో ఇళ్లు నిర్మించుకొని కొన్నేళ్లుగా జీవిస్తున్న వారికి ఓపన్‌కాస్ట్ కింద ఇళ్లను, భూములను కోల్పోయామని, మరికొందరు ఇళ్లు లేక అక్కడే జీవిస్తున్నామన్నారు.

చెట్ల పొదలకు పాములు అధికంగా వస్తున్నాయని, తమకు ఇళ్లు నిర్మించేందుకు భూమిని ఇప్పించి నష్ట పరిహారం అందించాలని, కూలీ డబ్బులు ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కట్ట భూలక్ష్మి, నర్సింహస్వామి, చెవుల లక్ష్మి, తదితరులు ఉన్నారు.

**● అక్రమ ప్లాట్‌లను రద్దు చేయాలి..**

**- పడ్తనపల్లి గ్రామస్థులు**

హాజీపూర్ మండలం పడ్తనపల్లి ఎల్లంపల్లి ముంపు గ్రామస్థులకు ఇచ్చిన ఆర్ ఆండ్ ఆర్ కాలనీలోని ప్లాట్‌లలో తమ ఊరికి చెందని వ్యక్తులకు ప్రజా ప్రతినిధి తమ్ముడు ఇష్టారాజ్యంగా ప్లాట్లు చేస్తూ అమ్ముకుంటున్నాడని, వాటిని సంబంధిత అధికారులు రద్దు చేసి వ్యక్తులపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు శెట్టి శ్రీనివాస్, చెరుకు రాజయ్య, గొల్ల శ్రీనివాస్‌లు వినతి పత్రం అందజేశారు.

**● న్యాయం చేయాలని మహిళ వినతి..**

లక్షెట్టిపేటకు చెందిన ఆసాది వేణి సువేణి తన భర్త నుంచి పోషక ఖర్చుల నిమిత్తం నెలకు రూ. 4500 ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ గత 18 నెలలుగా ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

**● సబ్ స్టేషన్ ప్రారంభించాలి..**

జైపూర్ మండలం ఇందారం గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయినప్పటికి దాని ప్రారంభం నోచుకోక గ్రామస్థులకు తీవ్రంగ విద్యుత్ అంతరాయం కలగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సబ్ స్టేషన్‌ను ప్రారంభించి తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో తిరుపతి, రాకేష్, తదితరులు ఉన్నారు

# కవ్వాల టైగర్‌జోన్‌లో శిక్షణ ఐఏఎస్‌ల పర్యటన

**జన్నారం :** కవ్వాల టైగర్‌జోన్‌లో ట్రెయినీ ఐఏఎస్‌లు సోమవారం తెల్లవారుజామున అల్లినగర్, దొంగపెల్లి, మల్యాల అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ ఉన్న అడవిలో ఉండే వన్యప్రాణుల గురించి ఎఫ్‌ఆర్‌ఓ రాజారావును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో నివసించే గిరిజనులు వారి జీవన స్థితిగతులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడి సంస్కృతి సాంప్రదాయాలు, వారి పద్ధతులపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని జింకల శరణాలయం, అధ్యయన కేంద్రాలను సందర్శించారు. హరిత రీసార్ట్‌లో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికి యాదాద్రి, లక్నవరం, ఆదిలాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ముఖ్య ప్రదేశాలను రాష్ట్ర దర్శన్‌లో భాగంగా సందర్శిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ రాష్ట్ర ధర్శన్ వల్ల రాష్ట్రంలో ఉండే ముఖ్య వనరులు, గిరిజనుల పరిస్థితులు, అటవీ ప్రాంతాలు, సందర్శన ప్రదేశాలు, పర్యాటక ప్రదేశాలు, అడవులు, సాంప్రదాయాలు, సంస్కృతులపై అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం కడెం ప్రాజెక్టును తిలకించేందుకు వెళ్లారు. సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లలో సతీష్, గోపి, దిపేష్, హనుమంత్, ఉదయ్, ప్రియంక, క్రాంతిలు ఉన్నారు. వారి వెంట స్థానిక తహసీల్దార్ మనోహర్‌రావు, ఎకో టూరిజం జిల్లా అధికారి రవికుమార్, ఆర్ఐ సంతోష్ తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న శిక్షణ ఐఏఎస్‌లు

# 'చెట్లతోనే పర్యావరణ సమతౌల్యం'

**మంచిర్యాల టౌన్:** చెట్లతోనే పర్యావరణ సమతౌల్యం సాధ్యమని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. జిల్లా క్రీడలు, యువజన అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు హరితహారం కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు పౌరులందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో క్రీడలు, యువజనశాఖ జిల్లా అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి పీఏవీ నర్సింహాచారి, పీడీలు మీనారెడ్డి, గోపాల్, జీవరత్నం, శ్రీనివాస్, గ్రీన్‌కోర్ మాస్టర్ ట్రైనర్ గుండేటి యోగేశ్వర్, అటవీశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్, అధికారులు

# 'విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

**మంచిర్యాల రూరల్ :** రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో తెరాస ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నవతెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌టీఎస్‌ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి రాంప్రసాద్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఎస్‌ఎఫ్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 99 పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం అన్యాయమన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు ఇచ్చే డబ్బులకు ఆశపడి పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ విద్యా సంస్థలను మూసివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జిల్లాలో ఫీజుల దోపిడి విచ్చలవిడిగీ జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. సమావేశంలో జిల్లా అద్యక్షుడు గొల్లపెల్లి చంద్రశేఖర్, కార్యధర్శి భూపతి, జిల్లా నాయకులు జియాఓద్దీన్, రాకేష్, మహేష్, సాయికిరణ్, తిరుపతి, వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు బలవుతున్నారు!

■ రోజురోజుకూ అధికమవుతున్న పాముల బెడద ■ పెరుగుతున్న బాధితులు ■ అవగాహన కల్పించడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలం


**భైంసా:** వర్షాకాలంలో నేపథ్యంలో అన్ని ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని నీటి నిల్వ గుంతలు, చెట్ల పొదలు, పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాలు, అక్కడా ఇక్కడా అనే బేధం లేకుండా పాముల సంచారం ఉంటుంది. కాగా, ఇదే సమయంలో పాము కాటు సంఘటలు పలుచోట్ల పెరిగిన వైనం ఆందోళనకు గురిచేస్తోంది. పాముకాటుకు అత్యధిక సంఖ్యలో పంటచేలు, ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లోనే గురవడం గమనార్హం. వారం రోజుల వ్యవధిలో నిర్మల్ జిల్లా భైంసా డివిజన్ పరిధిలో లోకేశ్వరం, బాసర ప్రాంతాల్లో జరిగిన పాము కాటు ఘటనల బారిన పడి ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడగా, ఇటీవల ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో ఒకరు, మరో గిరిజన మహిళ మృతి చెందారు.

## ● జూన్ నెల నుంచి పాము బుసలు ఎక్కువ..

సాధారణంగా వేసవి కాలం ముగిసి వర్షాకాలం అరంభమయ్యే జూన్ నుంచి అన్ని ప్రాంతాల్లో పాము బుసలు ఎక్కువ అవుతుంటాయి. ఆ తర్వాత వర్షాలు పడి పచ్చదనం పెరుగుతున్న కొద్ది వాటి సంచారం అధికమవుతుంటుంది. పంటచేలు పచ్చదనంతో నిండుకున్న పరిసర ప్రాంతాల్లో ఇవి సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే పాము కాటు ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వారం రోజుల వ్యవధిలో లోకేశ్వరం మండలంలోని గడ్‌చాంద, మన్మద్, బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామంలో ముగ్గురు వ్యక్తులు పాము కాటు బారిన పడి మృత్యువాత పడ్డారు. గతంతో పోల్చితే పాము కాటు ఘటనలు పెరిగినట్లుగా భైంసా డివిజన్ వాసులు పేర్కొంటున్నారు.



ఆసుపత్రులకు సరఫరా చేసిన యాంటీ స్నేక్ వీనం


పంటచేలలో సంచరిస్తున్న వివిధ రకాల పాములు (ఫైల్)

## ● ఆందోళనతో పరిస్థితి ప్రమాదకరం

**- డా.కాశీనాథ్, ఏరియా ఆసుపత్రి, భైంసా**



విషసర్పాలు కాటేసినప్పుడే కొంత వరకు ప్రాణాపాయం ఉంటుంది. సకాలంలో చికిత్స తీసుకుంటే బయటపడొచ్చు. ప్రాథమిక చిట్కాలతో విషాన్ని సాధ్యమైన మేర తొలగించవచ్చు. ఆందోళనతోనే బాధితుల నాడీ వ్యవస్థ, అనంతరం గుండెపై విష ప్రభావం త్వరగా పడుతుంది. అన్ని ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

## ● పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- వీధి దీపాలు లేని మార్గాలు, పచ్చని నిర్మానుష్య ప్రదేశాలు, డంపింగ్ యార్డు మార్గాలు, కాలి బాటలు, పొలాల్లో గట్లపై రాత్రి వేళ సంచరించేటప్పుడు టార్చిలైటును విధిగా వినియోగించాలి.
- 50 శాతం పాముకాట్లు మోకాలికి కింది భాగంలోని సంభవిస్తున్నాయి. పొలాల్లో సంచరించేటప్పుడు పంచే లేక లుంగీని ధరించి పాదాల వరకు ఉండేలా చూసుకోవడం మంచిది.
- పొలం గట్లతో పాటు ధాన్యపు కల్లాల్లో తిరిగేటప్పుడు కర్ర చప్పుడు చేస్తూ ముందుకు సాగడం ఉత్తమం. ఆ చప్పుడుకు విషపురుగులు పక్కకు తప్పుకొంటాయి.
- పంటచేలు, ఇళ్లకు చుట్టుపక్కల పరిసరాల్లోనే అధిక శాతం పాము కాట్లు సంభవిస్తున్నాయి. ఎక్కువ ఘటనలు గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయని వైద్యుల పరిశీలనలో తేలింది.
- ఇళ్ల చుట్టుపక్కల చెద్ద,చెదారం పేరుకపోకుండా చూడాలి. కోళ్ళ, కుక్కలు పెంచుకోవడం వల్ల పాములు పరిసర ప్రాంతాలకు రావు.
- పాములు ఇంటి పరిసరాల్లో సంచరిస్తున్నట్లుగా గమనిస్తే ఆ ప్రదేశంలో కిరిసిన్, పెట్రోల్, పొగాకు పధార్థాలు ఆ దారి వెంటన పోస్తే అటుగా రావు.
- రాత్రి ఇళ్లలోకి క్రిమి,కీటకాలు రాకుండా తలుపులు ,గడపల వద్ద రంధ్రాలు లేకంఉడా జాగ్రత్త పడాలి. వీలైనంత వరకు కింద పడుకోకుండా ఉండటం మేలు
- సీజన్‌లోనైనా ఆరోగ్య శాఖాధికారులు ముందుచూపుగా గ్రామీణ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని పరిస్థితులు సూచిస్తున్నాయి. కానీ ఇంత వరకు వైద్య ఆరోగ్యశాఖ అలాంటి దిశగా వ్యవహరించిన దాఖలాలు మచ్చుకైన చేపట్టడం లేదు. అవగాహన లేమితో పాము కాటు ఘటనలు, మృత్యువాత ఘటనలు పెరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.
- ముఖ్యంగా పాము కాటేసినప్పుడు నాటు వైద్యాన్ని ఆశ్రయించకుండా ప్రాథమిక చికిత్స ఆపై ఆసుపత్రికి తరలించాల్సిన విధానాలపై అవగాహన కల్పించాలి. వాస్తవానికి జిల్లాలో ఈ తరహా కార్యక్రమాలు చేపడుతున్న సందర్భాలు మాత్రం మచ్చుకు కనిపించడం లేదు.

## ● పాము కాచేస్తే ఏం చేయాలి..

- కాటు సంభవించిన వెంటనే అది పాముదేనా?.కాదా ? అనే విషయాన్ని త్వరగా నిర్ధారించుకోవడం అత్యవసరం. బాధిత వ్యక్తిగాని, అక్కడున్న వారు గానీ గుర్తించలేని పరిస్థితిలో ఉంటే సమయాభావం వల్లమృత్యువాత పడే ప్రమాదం ఉంది. అందుకే నిద్రలో పాము కాటేస్తే కొందరు గుర్తించలేక మంచంపై నుంచే మరణశయ్యపైకి ఎక్కుతున్నారు ఒక్కోసారి మద్యం మత్తులో పాము కరిస్తే గుర్తించలేని పరిస్థితి ఉంటుంది.
- పాము కరవగానే నిమిషాల వ్యవధిలో అప్రమత్తమవ్వాలి. అందుకే వెనువెంటనే కాటేసిన పైభాగానికి రక్త ప్రసరణ జరగకుండా తాడుతో గట్టిగా కట్టాలి. పదునైనా కొత్త బ్లేడుతో కాటు భాగం వద్ద గాయం చేసి రక్తాన్ని బయటకు లాగాలి..
- పాము కాటు వద్ద గాయం చేసి కొందరు నోటి ద్వారా రక్తాన్ని ప్రయత్నం చేస్తారు. ఈ సమయంలో రక్తం పీల్చే వ్యక్తికి నోటిలో గాయాలు చిగుళ్ల వ్యాధులు వంటికి లేకుండా ఉంటే పర్వాలేదు. లేని పక్షంలో వారిపైనా విషప్రభావం కనిపించే అవకాశలు ఎక్కువగా ఉంటాయి.
- పాము కాటు బారిన పడ్డ వారిని నడిపించడం, పరుగులు తీయించడం కాని చేయవద్దు. పసర్లు, నాటు మందులు అని కాలయాపన చేయకుండా దగ్గరలోని ఆసుపత్రికి వీలయినంత త్వరితగతిన తరలించాలి.

# కోలంగూడలో ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన

● ప్రభుత్వ పథకాలపై ఆరా ● హరిత రిసార్టులో మొక్కలు నాటిన ట్రైనీ ఐఏఎస్‌లు

**కడెం:** నిర్మల్ జిల్లా కడెం పెద్దూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోలాంగూడ గిరిజన గ్రామంలో సోమవారం ట్రైనీ ఐఏఎస్‌లు జితేష్, హనుమంతు, సతీశ్, గోపీలు పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. గిరిజనులకు గ్రామంలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న పథకాలు, వారి జీవన విధానాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు సమస్యలను గిరిజనులు వారి దృష్టికి తెచ్చారు. అనంతరం కడెం హరిత రిసార్టును సందర్శించి మొక్కలను నాటారు. ప్రాజెక్టు వద్ద టూరిజం బూట్‌లలో విహరించి కడెం అందాలను ఆస్వాదించారు. వారి వెంట కడెం సర్పంచ్ చిట్యాల చిన్నయ్య, ఐటీడీఏ ఏపీవో నాగోరావు, ఏసీవో గంగాధర్, వీఆర్‌వో నర్సయ్య, తదితరులున్నారు.

## ● కుంటాల జలపాతాన్ని తిలకించిన ట్రైనీ ఐఏఎస్‌లు

**నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల జలపాతాన్ని సోమవారం ట్రైనీ ఐఏఎస్‌లు గోపిజితేష్, హనుమంత్, సంతోష్, ప్రియాంక, ఉదయ్, క్రాంతిలు సందర్శించారు. ఈ సందర్భంగా కుంటాల జలపాతం అందాలను తనివి తీరా తిలకించారు. ఐఏఎస్ ట్రైనింగ్‌లో భాగంగా కుంటాల జలపాతానికి రావడం జరిగిందని సహాజ సిద్ధంగా ఏర్పడ్డ జలపాతం రాష్ట్రంలో ఎత్తైన జలపాతం, అభివృద్ధి చెందితే పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉంటుందన్నారు. జలపాతం అందాలు తిలకించడం ఓ తీపి జ్ఞాపకమన్నారు. వారి వెంట టూరిజం అధికాంరి రవీందర్, ఏపీవో నాగోరావు, ఏటీడీవో అత్రం భాస్కర్, ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింబ్, హెచ్‌సీ కాత్లె రమేష్, తదితరులు ఉన్నారు.


మొక్కలు నాటుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

# రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ భూస్థాపితమే

● ఆదిలాబాద్ నుంచే విజయ ప్రస్థానం ప్రారంభం కావాలి ● కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి

**ఆదిలాబాద్ టౌన్:** దేశంలో ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి వచ్చి టీఆర్ఎస్ భూస్థాపితమవుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ఆచారి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో రాష్ట్రంలో గెలుపు ముంగిట ఓటమి చూసినప్పటికీ 2019 ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇందుకు కార్యకర్తలు, నాయకులు, నేతలు బూత్ కమిటీలు వేసి ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఒక దగుల్బాజీ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు గతి లేదని మండిపడ్డారు. వృద్ధులకు, వికలాంగులకు రూ.వెయ్యి, రూ.1500 పింఛన్ ఇస్తూనే.. మరోపక్క వారి నుంచి వివిధ రకాల రూపంలో రూ.2వేలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్ర భుత్వానికి భవిష్యత్తు లేదన్నారు. బీజేపీ కార్యకర్తలు, యువకులు బూత్ స్థాయి కమిటీలు వేయాలని ఈ కమిటీలతోనే గెలుపు ఆధారపడి ఉందని సూచించారు. రాబోయే రోజుల్లో ఆదిలాబాద్ జిల్లానే అగ్రగామిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలో కేవలం 53 ఓట్లతో వెనుకబడిన నేను.. రాబోయే ఎన్నికల్లో గెలుపుతో సహచరులకు స్ఫూర్తి నింపుతా మన్నారు. ఇటు ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక రోగి అని, జోగు రామన్న జోకుడు రామన్నగా తయారయ్యారే తప్ప.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ప్రతీ బూత్‌లో బీజేపీ జెండా ఉండాలని, రాబోయే ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధమై టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పార్టీలో బీఎస్పీ నుంచి 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన భూమారెడ్డి పార్టీలో చేరారు. ఈ సమావేశంలో బీజేపీ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి విక్రంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాయలశంకర్, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, అల్లూరి నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యలహేమాజి, మడావి రాజు, శ్రీ రాంనాయక్, నాంపెల్లి వేణుగోపాల్, విజయ్‌సింగ్ షెకావత్, దాసరి సతీష్, ఆకుల ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.




పార్టీలో చేరుతున్న బీఎస్పీ నాయకులు
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి)

# మామూళ్ల మత్తులో అబ్కారీ శాఖ

- బెల్టు బాగోతంపై పెదవి విప్పని ఎక్సైజు శాఖ అధికారులు
- కాసులు ఇవ్వకపోతేనే దాడులు
- గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం అక్రమ విక్రయాలు
- ఛిద్రమవుతున్న పేదల కుటుంబాలు
- పట్టించుకోని పాలకులు

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

ఎక్సైజ్ శాఖ పనితీరుపై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపిన ఆ శాఖాధికారులు గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు షాపుల బాగోతంపై ఎందుకు పెదవి విప్పడం లేదని విమర్శలు వస్తున్నాయి. కాసుల కక్కుర్తి పడి కళ్లు మూసుకుంటున్నారా అనే పలువురు ప్రశ్నిస్తున్నారు. తాగేందుకు మంచినీళ్లు దొరకడం లేదని మహిళలు రోడ్డెక్కుతున్నారు. కాని మద్యం దొరకని గ్రామం అంటూ జిల్లాలో ఎక్కడా లేదు. గుడుంబా మహమ్మారితో పేదల ఇళ్లు, ఒళ్లు గుల్లవుతోందని శాసనసభలోనూ, బయటా గగ్గోలు పెట్టిన పాలకులు ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామాల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరిగేలా ప్రోత్సహిస్తున్నారు. మద్యం విక్రయాలను పెంచడం ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం రాబట్టాలంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. గుడుంబా విషయంలో ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపిన పాలకులు మద్యం అక్రమ విక్రయాలను ఎందుకు కట్టడి చేయడంలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అడపాదడపా పోలీసులు దాడులు జరిపి మద్యం అక్రమ రవాణాను అడ్డుకుంటున్నా.. అబ్కారీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆదాయంతో పాటు అనుకున్న స్థాయిలో మామూళ్లు వస్తుండడంతో బెల్ట్ వ్యాపారాన్ని పట్టించుకోనవసరం లేదనే ధోరణిలో ఆ శాఖ అధికారులు ఉన్నట్లు బహిరంగంగానే పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర రాజధానిలో వెలుగు చూసిన డ్రగ్స్ వినియోగంపై హడావిడి చేస్తున్న అబ్కారీ శాఖ అధికారులు క్షేత్ర స్థాయలో జరుగుతున్న బెల్ట్ బాగోతంపై దృష్టి సారిస్తే పేదల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎక్సైజ్ అధికారిని వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



జిల్లా కేంద్రంలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం

### పట్టింపు లేని పాలకులు

విచ్చల విడిగా కొనసాగుతున్న మద్యం అక్రమ విక్రయాలతో పేదల కుటుంబాలు ఛిద్రమవుతున్నా పాలకుల కంటికి కనపడటం లేదు. కొన్ని మండలాల్లో వైన్ షాపులు లేకున్నా.. ఆ మండలంలోని ప్రతీ గ్రామంలో మద్యం దొరకడం ఈ దందాకు అద్దం పడుతోంది. ఉదాహరణకు.. తాంసి మండలలో ఒక్క వైన్ షాపు లేకున్నా.. ప్రతీ గ్రామంలో 24 గంటల పాటు మద్యం దొరుకుతుంది. ఆదాయం కోసం ప్రభుత్వ ఆరాటం, మామూళ్ల కోసం అబ్కారీ అధికారుల ఉబలాటం.. ప్రభుత్వం, ప్రజల బలహీనతను సొమ్ము చేసుకునేందుకు వ్యాపారుల ఉత్సాహం వెరసి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఏకంగా ఒక్కో మద్యం సీసానూ గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) కన్నా రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. ఎక్కువగా పేద, మధ్య తరగతివారే ఆసరా కావడం దారుణం.

### బడా మద్యం వ్యాపారులదే హవా

మద్యం దుకాణం అనుమతులు పొందిన బడా వ్యాపారులు తన సామ్రాజ్యాన్ని పలు గ్రామాలకు విస్తరిస్తూ యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు లైసెన్సుదారుడు 20 నుంచి 30 గ్రామాల్లో బెల్టు షాపులు, ఇతరత్రా మద్యం అక్రమ విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందాకు వీడీసీ సభ్యులు, రాజకీయ నేతలు, యువకులు అడ్డుతగలకుండా 'అన్ని ఏర్పాట్లు' చేస్తున్నారు. టెండర్ ప్రక్రియ మొదలుకొని అధికారుల వేదింపుల వరకు అన్ని తామై చూసుకుంటామంటూ గ్రామ స్థాయిలో మద్యం విక్రయించే వ్యాపారులకు భరోసా ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఓ వైన్ షాప్ యజమాని దాదాపు నాలుగైదు మండలాలకు తన దుకాణం నుంచి మద్యం సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఇందుకు నిదర్శనం.

### ఇవ్వాల్సింది ఇస్తేనే ఏదైనా..

జిల్లా వ్యాప్తంగా 243 గ్రామ పంచాయతీల పరిధిలో బెల్ట్ షాపుల వ్యాపారం జరుగుతోంది. ఒక్కో దుకాణానికి నెలకు రూ.వెయ్యి చొప్పున సంబంధిత అధికారులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతీ నెల జిల్లాలో రూ.2 లక్షకు పైననే మామూళ్లు దండుకుంటున్నారు. మామూళ్లు ఇచ్చేందుకు నిరాకరిస్తే.. నిబంధనల పేరిట దాడులు చేయడం పరిపాటి. సంపన్నులు డ్రగ్స్ తీసుకుంటే హడావిడి చేస్తున్న అధికారులు మద్యం ప్రియులను ఎందుకు వదిలేస్తున్నారనేది అసలు ప్రశ్న.

> **ఆదాయం పిండుకోవడమే..**
>
> కొన్ని మండలాల్లో వైన్ షాపులు లేకున్నా.. ఆ మండలంలోని ప్రతీ గ్రామంలో మద్యం దొరకడం పాలకుల తీరుకు అద్దం పడుతోంది. మద్యం విక్రయా లను పెంచడం ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం రాబట్టాలంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఆదాయంతో పాటు అనుకున్న స్థాయిలో మామూళ్లు వస్తుండడంతో బెల్ట్ వ్యాపారాన్ని పట్టించుకోనవసరం లేదనే ధోరణిలో అధికారులు ఉన్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# కొత్త పరిశ్రమలు రావట్లే.. ఉన్నవాటికి తాళాలు

- పత్తిమిల్లు జాడ లేదు.. ఉక్కు ఫ్యాక్టరీ ఊసు లేదు
- బీడీ కార్మికుల జీవో ఉత్తిదే
- అన్నింటా సర్కారు వైఫల్యం
- సీఐటీయూ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ ధ్వజం





మాట్లాడుతున్న జయలక్ష్మీ.. పర్స సత్యనారాయణ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న సాయిబాబు

**ఉట్నూర్:** తెలంగాణ రాష్ట్రం సిద్ధించి మూడేళ్ల గడిచినా ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమలు స్థాపించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ ధ్వజమెత్తింది. సీఐటీయూ జిల్లా మహాసభల సందర్భంగా రెండో రోజు సోమవారం జరిగిన ప్రతినిధుల సభలో రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ మాట్లాడారు. కొత్త రాష్ట్రం వచ్చాక వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు పారిశ్రామిక కళ వస్తుందని ప్రజలు భావిస్తే.. టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న మిల్లులను మూతపడేలా చేస్తోందని విమర్శించారు. నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్‌లలో ఉన్న బీడీ పరిశ్రమల సమస్యల పరిష్కారం కావడంలేదని, బీడీ కార్మికులకు జీవో 41 అమలు కావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, ఉట్నూర్ ప్రాంతాలలో ఇటుక బట్టి కార్మికుల ఇబ్బందులు అలానే ఉన్నాయన్నారు. తెల్లబంగారం పండిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలో స్పిన్నింగ్ మిల్లుల ఏర్పాటు జాడ లేదని, భూగర్భ సంపద అపారంగా ఉన్నా ఉక్కు పరిశ్రమ ఊసులేదని మండిపడ్డారు. మూతపడిన సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల చట్టాలు అమలు కావడం లేదన్నారు. నూతనంగా సిమెంట్ ఫ్యాక్టరీని, దుస్తుల పరిశ్రమను ఏర్పాటు చేయాలని, జిన్నింగ్, ఆయిల్ పరిశ్రమలకు రాయితీలు కల్పించి కార్మికులకు ఉపాది అవకాశాలు మెరుగు పరచాలని, ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### అమరులకు నివాళ్లు

కార్మిక ఉద్యమాలలో పాల్గొని అమరులైన వారికి సీఐటీయూ ప్రతినిధులు నివాళులర్పించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సీ నారాయణరెడ్డి, సీఐటీయూ నేతలు పర్స సత్యనారాయణ, గంగుబాయి, గంగమ్మ, మహేందర్, పోశన్న, విఠల్, షేక్ జమాల్ తదితరులకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాములు, నాయకులు బండి దత్తాత్రి, మయూరి, మల్లేష్, జాదవ్ రాజేందర్, రత్నమాల, ముక్తానంద, మీనాకూమారి, ప్రవల్లిక, స్వర్ణలత, పూసం సచిన్, తొడసం భీంరావు, ముంజం శ్రీనివాస్, షేక్ గాదేమీయా తదితరులు పాల్గొన్నారు.

## కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ మనీషా
- గోప్యంగా కౌన్సిల్ సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రంగినేని మనీషా

**ఆదిలాబాద్ టౌన్:** మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని మీడియాకు కనపడకుండా గోప్యంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు అక్షరాలా అమలయ్యాయి. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగి ఈ సమావేశానికి కొంత మంది కౌన్సిల్ సభ్యులు, చైర్‌పర్సన్ మనీషా, పలువురు అధికారులు హాజరయ్యారు. గత సమావేశాలకు భిన్నంగా మీడియాను అనుమతించలేదు. కౌన్సిల్‌లోని 36 మంది సభ్యులకు గాను 30 మంది అధికార పక్షానికి చెందినవారే. గత సమావేశాల్లో చైర్‌పర్సన్‌ను వ్యతిరేకించే వర్గం కౌన్సిలర్లు తరచూ ఆమె ప్రసంగాలకు అడ్డుతగిలే వారు. దాదాపు ప్రతీ అంశంపైనా ఆమెను ఇరుకునపెట్టేందుకు ప్రయత్నించేవారు. అయితే మీడియాను అనుమతించకూడదన్న ముఖ్యమంత్రి వాస్తవ పరిస్థితి తెలియరాలేదు. కాగా సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు చైర్‌పర్సన్ మనీషా పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులతో కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే రోడ్లు, డ్రైనేజి వంటి పనులు పూర్తి చేశామని, మరిన్ని అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్లకు వెళ్లే బీటీ రోడ్ల పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇందుకు సభ్యులందరు సహకరించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫారుఖ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'రేషన్ డీలర్ల సమ్మె లేదు'

**ఆదిలాబాద్‌టౌన్:** తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చినందున ఈ నెల 1 నుంచి చేయతలపెట్టిన సమ్మెను ఉపసంహరించినట్లు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాంపెల్లి వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రానున్న 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం నాయకులతో జరిపిన చర్చల్లో లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చినందున ఈ నిర్ణయి తీసుకున్నట్లు ఆయన వివరించారు. కాగా తమ ఆందోళనకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రేషన్ డీలర్లు విలాస్, వెంకటేష్, రవి, గంగన్న, కిషన్, జీవన్, సుధీర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ లక్కేరావును అభినందించిన ప్రొఫెసర్ జయధీర్



చైర్మన్ లక్కేరావును సన్మానిస్తున్న ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు

**ఉట్నూర్:** ఐటీడీఏలో ఆదిమ గిరిజనుల అభివృద్ధి సలహా కమిటీ చైర్మన్ కనక లక్కేరావును గుంజాల గోండు లిపి అధ్యయన కేంద్రం నిర్వాహకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెంచి ప్రొఫెసర్ దానియేల్ నిజెక్స్, ప్రొఫెసర్ మనోజ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతు బిడ్డకు మెడిసిన్‌లో సీటు



సరితకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

**ఇంద్రవెల్లి:** ఏమాయికుంటకు చెందిన గిరిజన రైతు రాథోడ్ శ్యాంరావ్ కుమార్తె సరితకు ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ వచ్చింది. సరితకు ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా సరిత 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమన్నారు. కాగా సరిత అక్క రవిత బీ ఫార్మసి పూర్తి చేసింది. శ్యాంరావు-రాధాబాయి దంపతులను సోమవారం గ్రామస్థులు అభినందించారు.


నిరుపేద యువతికి వివాహ సామగ్రి అందజేస్తున్న 'మేముసైతం' సభ్యులు


పేద మహిళలకు ఇంటి సామగ్రి అందజేస్తున్న సభ్యులు

# ఆపన్నులకు 'మేము సైతం'

**● సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థ**

**అపదలో ఉన్నవారికి**

**మేమున్నామంటూ అండగా నిలుస్తున్నది 'మేముసైతం' స్వచ్ఛంద సంస్థ. మందమర్రి కేంద్రంగా ఓ యువకుని ఆలోచన లోంచి పుట్టిన ఈ సంస్థ, ఇప్పుడు 300 సభ్యులతో కార్యకలాపాలను విస్తరించింది. సమాజ సేవే పరమావధిగా వివిధ సామాజిక కార్యకలాపాలు నిర్వహిస్తూ, ఆనతికాలంలోనే పట్టణవాసుల ఆదరణ చూరగొన్నది.**

◆ మందమర్రి

మందమర్రి పట్టణానికి చెందిన భూబత్తుల శ్రీనివాస్ అనే యువకుడు 'మేముసైతం' స్వచ్ఛంద సంస్థను రెండేళ్ల క్రితం స్థాపించాడు. నాడు ఒక్కరితో ప్రారంభమైనా, ప్రస్తుతం 300 మంది సభ్యులతో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ప్రధానంగా ఈ సంస్థ సభ్యులు ఇతరుల నుంచి విరాళాలు సేకరించకుండా, సొంతంగా నిధి ఏర్పాటుచేసుకొని ఆపదలో ఉన్నవారికి సాయం చేస్తున్నారు. ఎవరైనా ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నా, ప్రమాదంలో అవయవాలు కోల్పోయినా వీరు ఆర్థికసాయం చేయడంతో పాటు పెద్దమొత్తంలో అవసరమనుకున్నప్పుడు వాట్సాప్ ద్వారా ప్రచారం చేసి, బాధితులకు నేరుగా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నారు. గతేడాది స్థానిక పాతబస్టాండ్ ఏరియాలోని విద్యానగర్‌కు చెందిన యువకుడు వినోద్ విద్యుత్‌షాక్‌కు గురై, రెండు చేతులూ కోల్పోగా, కృత్రిమ అవయవాల కోసం రూ.80వేల విరాళాలు సేకరించి, అందజేశారు. వేసవి కాలంలో ఊరు మందమర్రికి చెందిన నిరుపేద మహిళలు మాటేటి లక్ష్మి, లస్మక్క గుడిసెలు కాలిపోగా, రూ.50 వేల విలువైన సామగ్రి అందజేశారు. వేసవి కాలంలో రాష్ట్ర రహదారి, రాజీవ్‌నగర్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ పెరుగన్నం, అంబలి, మజ్జిగ, తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం మూడునెలల్లో మూడు లక్షల రూపాయల చొప్పున ఖర్చు చేశారు. వేసవిలో వడదెబ్బతో మృతిచెందిన రెండు కుటుంబాలకు రూ.8వేల చొప్పున అందజేసిన ఔదార్యం చాటుకున్నారు. ఇటీవల పట్టణంలోని సుగంధ్, మౌనిక నిరుపేద దంపతుల కూతురు సహర్షిని వింతవ్యాధితో బాధపడుతుండగా, ఆమెకు వైద్యచికిత్సల కోసం రూ.40వేల దాకా అందించారు. ప్రస్తుతం ఆ చిన్నారి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యపరిచేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లోనూ 'మేము సైతం' సభ్యులు భాగస్వాములవుతున్నారు. హరితహారం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పటికి పట్టణవాసులతో కలిసి వందలాది మొక్కలు నాటారు. గత వారం మందమర్రి మున్సిపల్ కార్యాలయం సమీపంలో 'సమానత్వంగోడ'ను ప్రారంభించారు. ఎవరైనా సరే త వ ం


వింత వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పిస్తున్న సభ్యులు

ఇంట్లో అదనంగా ఉన్న వస్తువులు, బట్టలు ఇక్కడ వేస్తే అవసరమున్నవారు తీసుకెళ్తున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీరి సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 'ఉత్తమ సేవ' అవార్డుతో పాటు, రూ.51వేల నగదు అందజేసింది. ఈ సంస్థకు సంబంధించిన 20 మంది కీలక సభ్యులు ప్రతి నెలా సమావేశమవుతూ కార్యచరణ సిద్ధం చేసుకుంటుడడం విశేషం.


విప్ నల్లాల ఓదెలు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న 'మేము సైతం' సభ్యులు


నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

## ప్రజాసేవ కోసమే 'మేముసైతం'

**- భూబత్తుల శ్రీనివాస్, అధ్యక్షులు**



ప్రజాసేవ కోసమే 'మేముసైతం' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాం. మా సంస్థలో 300కు పైగా సభ్యులున్నారు. ముఖ్యమైన సభ్యులందరం ప్రతి నెలా సమావేశమై, ఏయే కార్యక్రమాలు చేపట్టాలో నిర్ణయిస్తాం. నిరుపేదలకు, అనాథలకు అండగా ఉంటున్నాం. ఆలపాపాలనా లేని వృద్ధులను గుర్తించి, వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నాం. కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేదలకు తోచిన ఆర్థికసాయం అందజేస్తున్నాం. వివిధ సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు ఏర్పాటుచేశాం. మా సంస్థ రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవకు అంకితమవుతుంది. మా సంస్థలో ప్రధాన సభ్యులు సత్యం, బోరిగం వెంకటేశ్, టి. శ్రీశైలం, ఈ రాజు, కె. శ్రీనివాస్‌రెడ్డి, జైన శ్రీధర్, సారంగపాణి, జె. సత్యనారాయణ, చంద్రకాంత్ సాయంతో ముందుకుపోతున్నాం.

## పేదలకు అండగా..

**- పత్తిపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి**



మా సంస్థ నిరుపేదలకు అండగా పనిచేస్తున్నది. రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమై, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకుపోతున్నది. ఇటీవల వేసవి కాలంలో మూడునెలల పాటు మూడు లక్షలకు పైగా వెచ్చించి చలివేంద్రంలో అంబలి, పెరుగన్నం, మజ్జిగ పంపిణీ చేశాం. బాధితులు ఎవరైన వారి సమస్యను మా దృష్టికి తీసుకొస్తే తోచినవిధంగా సహాయం అందించి, అండగా నిలబడుతాం. మేము చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డుతో పాటు రూ.51వేలతో సత్కరించడం విశేషం. దీంతో మాపై బాధ్యత మరింత పెరిగింది.

## సభ్యుల నుంచి విరాళాలు సేకరిస్తాం

**- కొండ శ్రీనివాస్, కోశాధికారి**



మా సంస్థ సభ్యుల నుంచి విరాళాలు సేకరిస్తున్నాం. ఎవరైనా ఇస్తే తీసుకోవాలనుకుంటున్నాం. ప్రతి పైసాకు పక్కాగా లెక్కలు చూపుతున్నాం. వచ్చిన విరాళాలు, చేసిన కార్యక్రమాల గురించి పత్రికలకు తెలియజేస్తాం. ఖర్చు చేసిన నిధుల వివరాలను వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్నాం. సంస్థ సేవలను జిల్లా వ్యాప్తంగా విస్తరించడంతో పాటు మారుమూల గ్రామాల్లో ప్రజలకు సేవలందించడంపై ప్రస్తుతం దృష్టి సారించాం.

---

**శిశువుకు ప్రకృతి ప్రసాదించిన వరం తల్లిపాలు.** అమ్మపాలే బిడ్డకు చక్కని పోషకాహారం. శిశువు పరిపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంచేందుకు తల్లిపాలు దోహదపడతాయి. పాశ్చాత్య సంస్కృతి పుణ్యమా అని పలువురు తల్లులు, పుట్టినప్పటి నుంచే డబ్బాపాలు అలవాటు చేయడం వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతున్నది. అటు మాతృమూర్తుల ఆరోగ్యమూ దెబ్బతింటున్నది. తల్లీబిడ్డల నడుమ ఆప్యాయతానురాగాలు దూరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కోసం ఏటా ఆగస్టు మొదటివారంలో తల్లిపాలవారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

◆ భైంసా

# అమ్మపాలు అమృతం



❑ తల్లికీ, బిడ్డకూ శ్రేయస్కరం ❑ నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

**● ముర్రుపాలు ఎంతో శ్రేష్ఠం..**

ప్రసవం తర్వాత తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు నవజాత శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అప్పుడే బాహ్య ప్రపంచంలోకి వచ్చిన శిశువు, గర్భంలో ఉండే అన్ని సదుపాయలు కోల్పోతాడు. ఇలాంటి తరుణంలో బిడ్డకు ముర్రుపాలు సంపూర్ణ ఆహారం. పసుపు వర్ణంలో చిక్కగా, జిగటుగా ఉండే ముర్రుపాలు తాగిస్తే వాతం చేస్తుందనీ, జీర్ణం కావని కొందరు శిశువులకు తాగించడం లేదు. ఇది ఏమాత్రం సరికాదని వైద్యులు చెబుతున్నారు. శిశువులను ఆ దశలో అన్నిరోగాల నుంచి ముర్రుపాలు కాపాడుతాయంటున్నారు. వైద్య పరిభాషలో దీనిని కొలోస్ట్రామ్ అంటారు. శిశువు జన్మించిన అరగంటకే పాలు పట్టిస్తే శ్వాస, జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తవని స్పష్టం చేస్తున్నారు.

**● తల్లిపాలే శ్రీరామరక్ష..**

తల్లిపాలు శిశువులో వ్యాధినిరోధక శక్తి పెంచుతాయి. అనేక పోషక విలువల కలిగి ఉండడంతో శిశువు ఎదుగుదలకు తోడ్పడుతాయి. ముర్రుపాలు వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడి మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. శ్వాస సంబంధ వ్యాధులు, డయేరియాలాంటి రోగాలు దరిచేరవు. గొంతు, ఊపిరితిత్తులు, పేగులకు రక్షణ ఇస్తాయి. వివిధ వైరస్, బ్యాక్టీరియాల నుంచి రక్షణ కలుగుతుంది. ఇందులోని ప్రోటీన్లు, ఎంజైముల ద్వారా శిశువు ఆరోగ్యంగా ఉంటాడు.

**● పాలు ఇలా పట్టాలి..**

తల్లి శిశువుకు పాలిచ్చే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. శిశువు శరీరం, తల నిటారుగా ఉంచాలి. రొమ్ము వైపు శిశువును ముక్కుకు ఎదురుగా చనుమొన ఉండేలాగా తిప్పాలి. మెడ, భుజాలకు మాత్రమేగాక శరీరం మొత్తానికి ఆధారం కల్పించాలి.

**● పాలివ్వకపోతే రోగాలపాలు..**

కొందరు మహిళలు పాలిస్తే అందం దెబ్బతింటుందనే అపోహలో ఉంటారు. ఇది ఏమాత్రం సరికాదు. పాలు ఇవ్వకపోవడం వల్ల బిడ్డతో పాటు తల్లి కూడా రోగాలపాలయ్యే ప్రమాదముంది. చిన్నారులు పాలు తాగడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం సగానికి సగం తగ్గుతుంది. గర్భిణిగా ఉన్న సమయంలో శరీరంలో పేరుకపోయే కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. పిల్లలకు పాలిచ్చే స్త్రీల కంటే ఎప్పుడు పాలు ఇవ్వని స్త్రీలలో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అనేక పరిశోధనలు నిగ్గుతేల్చాయి. అందువల్ల ఇద్దరి ఆరోగ్యం దృష్ట్యా పాలివ్వడం ఉత్తమం.

**● ఇలాంటి పరిస్థితుల్లో తప్ప..**

తల్లి కొన్ని వ్యాధులతో బాధపడుతున్నప్పుడు వైద్యుల సలహా మేరకు పాలివ్వకపోవడమే ఉత్తమం. ఉదాహరణకు తల్లి టీబీ, హెచ్‌ఐవీ, ఇతరత్రా హృద్రోగాల బారిన పడినప్పుడు పాలు ఇవ్వవద్దని వైద్యులు చెబుతున్నారు. చనుమొనల్లో పగుళ్లు, రొమ్ముల్లో గడ్డలు ఉన్నప్పుడు కూడా ఇవ్వకపోవడమే ఉత్తమమని స్పష్టం చేస్తున్నారు.

**● బాగా పాలురావాలంటే..**

ప్రసవం తర్వాత పాలు బాగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచే మంచి పోషకాహారం తీసుకోవాలి. పచ్చి కూరగయాలు, పండ్లు తీసుకోవాలి. తరుచూ ఆకుకూరలు, మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహారం తినాలి.

## బిడ్డకు అన్నివిధాలా శ్రేయస్కరం

**- డాక్టర్ అనిల్ జాదవ్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, ఏరియా భైంసా ఆసుపత్రి**



తల్లిపాలు శిశువుకు అమృతంలో సమానం. ఎన్నో పోషక విలువలుగల తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు. భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. ప్రతి తల్లి నుంచి తన బిడ్డకు కావాల్సినన్ని పాలు సమకూరుతాయి. సరిపోవడం లేదని డబ్బా పాలు వాడడం వల్ల ప్రయోజనాల కంటే అనర్థాలే ఎక్కువగా ఉంటాయి. పాలిచ్చేటప్పుడు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

## తల్లి ఆరోగ్యానికీ మంచిది

**-డా. పద్మావతి, స్త్రీవైద్య నిపుణురాలు, ఏరియా ఆస్పత్రి భైంసా**



తల్లులు పిల్లలకు పాలిస్తే తమ సౌందర్యం దెబ్బతింటుందనే అపోహ సరికాదు. అవగాహన లేనివారే ఇలా ప్రవరిస్తారు. పిల్లలకు పాలు ఇచ్చిన తల్లులు ఆరోగ్యంగా, చలాకీగా ఉంటారు. శాస్త్రవేత్తల పరిశోధనల్లో సైతం ఇదే విషయం తేలింది.

---

# మత సామరస్యానికి ప్రతీక


సిర్పూర్(టి) మండల కేంద్రంలోని సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దర్గా

❑ సిర్పూర్(టి)లో నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు
❑ సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దర్గా ముస్తాబు
❑ మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు

**మత సామరస్యానికి ప్రతీకలా నిలిచే ఉర్సు ఉత్సవాలకు సిర్పూర్(టి) మండలం డౌనల్ ఏరియాలోని సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దర్గా ముస్తాబైంది. ఆగస్టు 1 నుంచి 3వరకు అంగరంగవైభవంగా వేడుకలు జరగనుండగా, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు.**

◆ సిర్పూర్(టి)

**● మూడురోజులపాటు..**

దర్గా షరీఫ్ వద్ద ప్రతి సంవత్సరం సయ్యద్ తాలీబ్ అలీషాబాబా జ్ఞాపకార్థం మూడురోజుల పాటు ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తున్నది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్రలోని అహిరి, చంద్రాపూర్, బల్లార్షా, తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, చెన్నూరు, ఆదిలాబాద్, కౌటాల, ఉట్నూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మొదటిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, రెండు, మూడోరోజు రాత్రి కవ్వాలీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోహీబ్ హుస్సెన్, ఉపాధ్యక్షుడు సాదత్ అలీల తెలిపారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆసిఫాబాద్, మంచిర్యాల ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

**● ఇదీ దర్గా చరిత్ర**

బాబా ఢిల్లీ నిజామొద్దీన్ వంశానికి చెందినవారనీ, దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితం చిన్న వయస్సులో పెన్‌గంగా, ప్రాణహిత నదులను దాటి లోనవెల్లి గ్రామం గుండా సిర్పూర్(టి)కి వచ్చారని పూర్వీకులు చెబుతారు. ఒక రోజు బాబా దగ్గరికి చిన్న పిల్లలు ఆకలితో ఉన్నామని రాగా, తన జోలే(సంచి) నుంచి వేడి వేడి అన్నం పెడుతూ కనిపించారని అంటారు. అలాగే ఓ రాజు మహారాష్ట్రలో యుద్ధం చేస్తూ తప్పించుకుని రాగా ఈ బాబా ఆయనకు ఆశ్రయం ఇచ్చారన్న కథ ప్రచారంలో ఉంది. అప్పటి నుంచి ఇక్కడ ప్రతి గురు, శుక్రవారాల్లో హిందువులు, ముస్లింలు కలిసి దీపారాధన చేస్తుంటారు. దీంతో పాటు ఏటా వైభవంగా ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇక్కడి బాబా ఆశీస్సులు పొందితే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. సిర్పూర్(టి) మండలంలోని అన్ని గ్రామాలతో పాటు ఆసి ఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, దహెగాం, బెజ్జూరు, మహారాష్ట్రలోని రాజురా, పోడ్సా, తదితర గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వస్తుంటారు. ప్రత్యేకంగా మొదటి రోజు గుర్రం సవారీతో బాబాకు ప్రత్యేకంగా చాదర్ ఏర్పాటు చేసి, ఊరేగింపు నిర్వహిస్తారు.

## ఇవి 73వ ఉర్సు ఉత్సవాలు

**-ఇనాయత్ అలీ, నిర్వాహకుడు**



ఇవి 73వ ఉర్సు ఉత్సవాలనీ, ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పెద్ద మసీదు వద్ద 'రహెమతుల్ అలమీన్' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ పట్టణానికి చెందిన మత పెద్దలు హాజరుకానున్నారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.

## అధికారులు, ప్రజలు సహకరించాలి

**-అహ్మద్, ఉర్సు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు**



అన్ని శాఖల అధికారులు, ప్రజలందరూ సహకరించి మూడురోజుల పాటు ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలి. దర్గా వద్దకు వచ్చే భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

## దర్గా వద్ద పారిశుధ్య కార్యక్రమాలు

**- సంతోష్‌కుమార్, జీపీ ఈవో**

ఆగస్టు 1, 2, 3 తేదీల్లో నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్గా వద్ద పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నాం. పిచ్చి మొక్కల తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. తాగునీటికి ఇబ్బందులు కలగకుండా నల్లాలు ఏర్పాట్లు చేయిస్తున్నాం. ఉత్సవ కమిటీ సభ్యులకు ఎలాంటి అవసరం ఉన్నా జీపీ నుంచి అన్ని సహాయ కార్యక్రమాలు చేపడుతాం.




# చిట్టి హృదయాలు

**పదకొండు ఫేస్‌బుక్ పోస్టులు.. యాభై ఏడు ఈ-మెయిల్స్.. వంద ఫోన్ కాల్స్.. రెండొందల వాట్సాప్ మెసేజ్‌లు.. మూడొందల ఎస్ఎంఎస్‌లు... ఐదుగురికి ప్రాణం పోశాయి. ఎలా?**

* * *

**అందరూ స్కూలు విద్యార్థులే. కానీ అందరిలోనూ ఏదో చేయాలనే ఆరాటమే. వాళ్ల ముందున్నది.. కొండంత లక్ష్యం అయినా అధైర్యపడకుండా అడుగు ముందుకు వేశారు. హృదయ సంబంధ లోపంతో బాధపడుతున్న 41 మంది చిన్నారుల బతుకుల్లో నవ్వుల వెలుగులు పూయించారు.**

# అద్భుతం చేశాయ్!

కాంజెన్షియన్ హార్ట్ డిసీజ్(సీహెచ్‌డీ).. అంటే హృదయాకార లోపంతో పుట్టడం. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. మన దేశంలో ఏటా 1.6 లక్షల పిల్లలు.. హృదయ సంబంధ లోపాలతో పుడుతున్నారు. వారిలో దాదాపు 78 వేల మంది చనిపోతున్నారు. 33 శాతం మంది మాత్రమే ఈ వ్యాధికి చికిత్స చేయిస్తున్నారు. పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలు మాత్రం తమ పిల్లలకు ప్రాణాంతక వ్యాధి ఉందని తెలిసినా.. నయం చేయించడానికి తగినంత డబ్బులు లేక వారిని కోల్పోతున్నారు. ఎంతో తీవ్ర సమస్యగా పరిణమిస్తున్న దీని గురించి తెలుసుకున్న 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బెంగళూరు నార్త్' (డీపీఎస్‌బీఎన్) విద్యార్థులు తమ వంతుగా ఏమైనా చేయాలని భావించారు. అందుకోసం 60 రోజుల్లో 20 లక్షల రూపాయల విరాళాలు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సీహెచ్‌డీతో బాధపడే పేద చిన్నారులకు గుండె ఆపరేషన్ చేయించే ఉద్దేశంతో 'డీపీఎస్ బిగ్ హార్ట్స్' పేరుతో ఆన్‌లైన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టారు. 'ఫ్యుయల్ ఏ డ్రీమ్' ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్యాంపెయిన్‌ను ముందుకు నడిపించారు.

ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించాలంటే.. ఎంతో సమయం వృథా అవుతుంది. అందుకే విద్యార్థులంతా ఆన్‌లైన్ మార్గాన్ని ఎంచుకున్నారు. విద్యార్థులు తమ కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వాళ్ల అందరికీ మెసేజ్‌ల రూపంలో తమ సందేశాన్ని పంపించారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, ఈ-మెయిల్.. ఇలా ప్రతి మాధ్యమాన్నీ వాడుకున్నారు.

- ఒక పిల్లోడికి 'గుండె ఆపరేషన్' చేయించాలంటే.. కనిష్ఠంగా 40 వేల రూపాయలు ఖర్చవుతుంది.
- 'డీపీఎస్‌బీఎన్'లో చదువుతున్న యాభై మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ఈ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు.
- ఒక్కో విద్యార్థి విరాళాల ద్వారా మినిమమ్ 40 వేల రూపాయల సేకరించాలి.
- ఈ క్యాంపెయిన్ ద్వారా విద్యార్థులు 17 లక్షల రూపాయలను సేకరించారు. దాదాపు 41 మంది పేద చిన్నారులకు ఆయువు పోశారు.

**'రెండు నెలల్లోనే.. మా విద్యార్థులు 41మంది చిన్నారుల జీవితాలను కాపాడారంటే. ఒక్కసారి ఊహించండి.. మనం తలుచుకుంటే ఎంతోమందికి జీవితాన్నివ్వగలం. సంతోషాలను పంచగలం. మంచి కోసం సమయాన్ని కేటాయించండి. వీలైనంత సాయం చేయండి. అందుకోసం టెక్నాలజీని వాడుకోండి'**

**- డీపీఎస్‌బీఎన్ ప్రిన్సిపాల్**



'24 గంటల్లోనే నేను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాను. 40 వేలు పోగయ్యాయి. నాకు డబ్బులు ఇచ్చిన వాళ్లంతా సాయం చేయలేదు. ఓ ప్రాణాన్ని కాపాడారు. కేవలం ఒకే ఒక్క రోజులో.. ఓ ప్రాణం నిలబడింది. అప్పుడే నాకో ఆలోచన మొదలైంది. ఎంతోమంది మనసున్నవారున్నారు. సాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇక్కడితో ఆగిపోకూడదని అనుకున్నాను. ఐదు వారాలు నిరంతరాయంగా ఫోన్‌కాల్స్, మేసేజెస్, ఈమెయిల్స్ చేస్తూనే ఉన్నాను. నా ప్రయత్నం ఫలించింది. మొత్తంగా 2 లక్షల ఐదు వందల రూపాయల విరాళాలు సేకరించాను. ఐదుగురు చిన్నారుల ప్రాణం కాపాడాను. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను'

**- క్రిష్ చెంగప్ప.**

## నవ్వుల్ నవ్వుల్



**మిస్టర్ మేధావి :** అరేయ్! ఈ రోజు టీవీలో 30 అడుగుల పామును చూపిస్తారట! కానీ ఏం లాభం నేను మాత్రం కేవలం తోకనే చూడగలను.
**నిరంజన్ :** అలా ఎందుకు రా?
**మిస్టర్ మేధావి :** మా టీవీ 24 అంగుళాలదే రా!
**నిరంజన్ :** !!!!!!!!!!!!!

## ఔనా !



**ఉత్తరంపై అడ్రస్ రాస్తేనే.. గమ్యస్థానానికి చేరవేస్తారనేది అందరికీ తెలిసిన విషయం. కానీ ఐస్‌లాండ్‌లో అడ్రస్ రాయకపోయినా.. గమ్యం తాలూకు మ్యాప్ గీస్తే సరిపోతుంది.**

## మీకు తెలుసా?



**మనిషి మెదడు పెరుగుదల... 18 ఏళ్లకు ఆగిపోతుంది.**

## చెప్పగలరా?

**సరుకులో ఉన్నా గానీ ఉరుకులో లేను**
**మరుపులో ఉన్నా గానీ మెరుపులో లేను**
**గాయంలో ఉన్నా గానీ గానంలో లేను**
**అయితే ఇంతకీ నేనెవరో చెప్పగలరా?**

## పదవినోదం


ఆధారాలకు సరైన ఆంగ్లపదాలను గడుల్లో రాయండి

| | | | |
|---|---|---|---|
| 1. మంచు | | | W |
| 2. తక్కువ | | | W |
| 3. విల్లు | | | W |
| 4. ఆవు | | | W |
| 5. వరుస | | | W |

## దారి కనుక్కోండి



## బొమ్మ గీయండి




## జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. సపంమీ ▸ ..........
2. జబులు ▸ ..........
3. వుకొలు ▸ ..........


## జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. CWRO ▸ ..........
2. CERA ▸ ..........
3. DWIN ▸ ..........

- పత్తిపాక అంకిత, హైదరాబాద్

## చుక్కలు కలపండి



## జవాబులు

చెప్పగలరా? : సమయం జంబ్లింగ్ వర్డ్స్ : 1.CROW 2.RACE 3.WIND
జంతర్‌మంతర్ : 1. సమీపం 2. జలుబు 3. కొలువు పదవినోదం : 1.dew 2.low 3.bow 4.cow 5.row 6.new

# At present member nations of NATO?

## Current Affairs & GK



A. Ravi Prakash Reddy
Senior Faculty

1. **ICC Women's Cricket World Cup 2017 won by…**
   1) England 2) India
   3) South Africa 4) Australia
2. **105th Indian Science Congress 2018 to be held in**
   1) Osmania University, Hyderabad
   2) S.V.University, Tirupati
   3) University of Mysore, Mysore
   4) University of Mumbai, Mumbai
3. **Find the wrong pair?**
   1) National Voters Day : January 25
   2) National Science Day : February 28
   3) National Mathematics Day : March 22
   4) National Civil Services Day : April 21
4. **Name the largest economy in the European Union (EU)?**
   1) United Kingdom 2) France
   3) Germany 4) None of these
5. **Which union ministry has launched an online complaint system "sexual harassment e-box" at workplace?**
   1) Ministry of Home Affairs
   2) Ministry of Law and Justice
   3) Ministry of Women and Child Development
   4) Ministry of Human Resource Development
6. **The United Nations declared 2017 as…..**
   1) International Year of Family Farming
   2) International Year of Soils
   3) International Year of Pulses
   4) International Year of Sustainable Tourism for Development
7. **Nobel Prizes are awarded every year in …..**
   1) 5 categories 2) 6 categories
   3) 7 categories 4) 8 categories
8. **Find the Indirect Tax?**
   1) Income Tax 2) Corporate Tax
   3) Gift Tax 4) Goods and Service Tax
9. **National Democratic Alliance (NDA) was founded in**
   1) 1998 2) 1999 3) 2000 4) None of these
10. **At present member nations of NATO?**
    1) 27 2) 28 3) 29 4) None of these
11. **Who is associated with Bachpan Bachao Andolan?**
    1) Medha Patkar 2) Anna Hazare
    3) Baba Amte 4) Kailash Satyarthi
12. **Income Tax Day observed every year in India on…..**
    1) June 29 2) July 24
    3) August 29 4) September 15
13. **Which country has recently declared total independence from IMF and World Bank (WB)?**
    1) North Korea 2) South Korea
    3) Bolivia 4) Myanmar
14. **Who is Takehiko Nakao?**
    1) The President of New Development Bank
    2) The President of Asian Development Bank
    3) The President of World Bank
    4) The President of Asian Infrastructure Investment Bank
15. **Who is the captain of Indian Cricket Team in ICC Women's World Cup 2017?**
    1) Harmanpreet Kaur 2) Poonam Raut
    3) Rajeshwari Gayakwad
    4) Mithali Raj
16. **Mossack Fonseca & Co., a law firm and corporate service provider, belongs to**
    1) Mauritius 2) Trinidad and Tobago
    3) Jamaica 4) Panama
17. **Ram Nath Kovind, the 14th President of India, assumed office on…..**
    1) 24 July 2017 2) 25 July 2017
    3) 26 July 2017 4) 27 July 2017
18. **Who was conferred with the Japan's imperial decoration 'Order of the Rising Sun' award for his contribution to fostering Japan-India ties?**
    1) Veerappa Moily 2) Shashi Tharoor
    3) Ashwani Kumar 4) None of these
19. **Rahul Chaudhari is associated with which sport?**
    1) Billiards 2) Hockey
    3) Shooting 4) Kabaddi
20. **Who among the following person is NOT associated with BRICS countries?**
    1) Mauricio Macri 2) Vladimir Putin
    3) Jacob Zuma 4) Xi Jinping
21. **Which of the following is correct regarding Grand Slim (Tennis) 2017?**
    1) Roger Federer (Switzerland) is the winner of Men's Singles in Australia Open 2017, by defeating Rafael Nadal (Spain).
    2) Rafael Nadal (Spain) is the winner of Men's Singles in French Open 2017, by defeating Stan Wawrinka (Switzerland).
    3) Roger Federer (Switzerland) is the winner of Men's Singles in Wimbledon Open 2017, by defeating Marin Cilic (Croatia).
    4) All of the above
22. **Who is the ambassador for Central Government's flagship Skill India campaign, with the National Skill Development Corporation?**



    1) Amitabh Bachchan
    2) Shah Rukh Khan
    3) Priyanka Chopra 4) None of these
23. **Match the following?**

| Company | Chairman |
|---|---|
| A. Amazon.com | (i) Mary Barra |
| B. General Motors | (ii) Jeff Bezos |
| C. IBM | (iii) Larry Ellison |
| D. Orcale Corporation | (iv) Mark Zuckerberg |
| E. Facebook | (v) Ginni Rometty |

| | A | B | C | D | E |
|---|---|---|---|---|---|
| 1) | (v) | (iv) | (iii) | (ii) | (i) |
| 2) | (i) | (ii) | (iii) | (iv) | (v) |
| 3) | (i) | (iii) | (v) | (ii) | (iv) |
| 4) | (ii) | (i) | (v) | (iii) | (iv) |

24. **Shikha Sharma is the MD & CEO of……**
    1) Kotak Mahindra 2) AXIS Bank
    3) HDFC Bank 4) ICICI Bank
